
# మనం

## కృష్ణా / గుంటూరు

ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు

బుధవారం | 17 |జూన్ | 2026 | పేజీలు: 16



## మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి కృషి




9 లో











8 లో

# అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

పి.మీరాహుస్సేన్ ఖాన్

- యోగా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యోగా గురువు బాబా రాందేవ్ హాజరు
- ఐజీఎంసీ స్టేడియంతోపాటు డా. బిఆర్ అంబేద్కర్ కళా వేదికలోనూ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

-విజయవాడ, మనంబ్యూరో

## క్లీన్ బెజవాడ .. కమిషనర్ టార్గెట్

8 లో



విజయవాడ నగర మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర టార్గెట్ ... క్లీన్ బెజవాడ. అందుకోసం నిత్యం ఆయన ప్రత్యేక శ్రద్ధతో నగర పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో కమిషనర్ పరిశీలిస్తున్నారు.

## సోషల్ మీడియాపై అణిచివేతకు నిరసన

4 లో

- భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే చర్యలు ఆపాలి
- దేవినేని అవినాష్




## రైతులకు ఎరువుల కొరత రాకుండా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు



- ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు
- జులై చివరి నాటికి గ్రీన్ గుంటూరు కార్యక్రమంలో లక్ష మొక్కల నాటడం లక్ష్యం
- రైతుల ఆదాయం పెంచటమే వ్యవసాయ అధికారుల లక్ష్యం కావాలి
- జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ

5 లో

## ఏపీఎయిమ్స్‌తో సమగ్ర వ్యవసాయ సాంకేతికత

- అన్నదాతలు యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- ఎరువుల సరఫరాలో పారదర్శకతకు పెద్దపీట
- క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు నిర్వహణ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



9 లో

# దేశవ్యాప్తంగా ఇసుజు ఐ-కేర్ ప్రీ-మాన్సూన్ సర్వీస్ క్యాంప్ ప్రారంభం




**గాంధీనగర్, జూన్ 16 మనం న్యూస్:** వాహన యాజమాన్య అనుభవాన్ని మరింత మెరుగుపరచడం లక్ష్యంగా ఇసుజు మోటార్స్ ఇండియా దేశవ్యాప్తంగా 'ఇసుజు ఐ-కేర్ ప్రీ-మాన్సూన్ సర్వీస్ క్యాంప్' నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఇసుజు డి-మ్యాక్స్ పికప్ వాహనాలు మరియు ఎస్యూవీ శ్రేణి వినియోగదారుల కోసం ఈ ప్రత్యేక సర్వీస్ క్యాంప్ జూన్ 18 నుంచి 24, 2026 వరకు దేశవ్యాప్తంగా ఉన్న అధీకృత డీలర్ సర్వీస్ కేంద్రాలలో నిర్వహించనున్నారు. మాన్సూన్ కాలంలో వాహనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడిచేలా నివారణాత్మక నిర్వహణ తనిఖీలు, ప్రత్యేక ఆఫర్లు అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సంస్థ తెలిపింది. ఈ క్యాంప్లో భాగంగా వినియోగదారులకు ఉచితంగా 37-పాయింట్ల సమగ్ర వాహన తనిఖీ నిర్వహించనున్నారు. అదనంగా లేబర్ ఛార్జీలపై 10 శాతం, విడిభాగాలు, ల్యూబ్స్, ఫ్లూయిడ్స్పై 5 శాతం తగ్గింపు ఇవ్వనున్నారు. రిటైల్ రోడ్సైడ్ అసిస్టెన్స్ (ఆర్ఎస్ఏ)పై 20 శాతం, ప్రోకేర్ సేవలపై 5 శాతం, పొడిగించిన వారంటీపై 20 శాతం వరకు ప్రత్యేక రాయితీలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. కొన్ని ఆఫర్లు ఎంపిక చేసిన బీఎస్వీఐ మోడళ్లకే వర్తిస్తాయని పేర్కొన్నారు. విజయవాడ సహా దేశంలోని పలు నగరాల్లో ఉన్న ఇసుజు అధీకృత సర్వీస్ కేంద్రాల్లో ఈ క్యాంప్ నిర్వహించబడుతుంది. వినియోగదారులు సమీప డీలర్ను సంప్రదించడం ద్వారా లేదా సంస్థ వెబ్సైట్లో సర్వీస్ బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు.

# యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రజలకు అవగాహన




**▸▸ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నందిగామ,జూన్16(మనం న్యూస్):** నందిగామ పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ భవన్లో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరిగిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య యోగా ఆసనాలు నిర్వహించి, యోగా యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆధ్యాత్మిక, ఆరోగ్య సంపద అని పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని అన్నారు.ప్రస్తుత కాలంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు అందరూ యోగా సాధన ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, యోగా సాధకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతలే శాశ్వత పరిష్కారం

**▸▸ నందిగామ ఆర్డీవో కార్యాలయంలో ఇంకుడు గుంతల ప్రారంభోత్సవం**

**▸▸ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నందిగామ,జూన్16(మనం న్యూస్):** భూగర్భ జలాలను కాపాడుకోవాలంటే ప్రతి ప్రభుత్వ కార్యాలయం, నివాస గృహం, వాణిజ్య సముదాయం వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటు అత్యంత అవసరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. బుధవారం నందిగామ ఆర్డీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఇంకుడు గుంతల ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను పరిశీలించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం భూగర్భ జలాల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన ఇంకుడు గుంతల వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకే విధంగా ఇంకుడు గుంతలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పెరుగుతున్న నీటి అవసరాలు, తగ్గుతున్న భూగర్భ జలాల నిల్వలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలకు ప్రజలు సహకరించి భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందుబాటులో ఉంచే బాధ్యతను అందరూ పంచుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో ఏమార్వో సురేష్ బాబు, మున్సిపల్ కమీషనర్ లోవరాజు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం చేయాలి

**▸▸ సమన్వయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పిలుపు**

**▸▸ జూలై 14 వరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి**

**▸▸ గ్రామాల్లో డొంక రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తీర్మానం**



**నందిగామ,జూన్16(మనం న్యూస్):** నందిగామ పట్టణంలోని కాకాని నగర్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సమన్వయ కమిటీ సభ్యులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత ప్రజా కార్యక్రమాల అమలు, గ్రామీణాభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, జూలై 14, 2026 వరకు నిర్వహించబడనున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా చేపట్టి విజయవంతం చేయాలని సూచించారు. సమన్వయ కమిటీ సభ్యులు తమ తమ పరిధిలో పూర్తి బాధ్యతలు స్వీకరించి ప్రజలకు చేరువగా పనిచేయాలని, కార్యక్రమం లక్ష్యాలు నెరవేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. అన్ని గ్రామాల్లో డొంక రోడ్ల నిర్మాణ పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు మరింత సౌలభ్యం కలిగేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సభ్యులకు సూచించారు. సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అమర్నాథ్ గౌడ్ హత్య అత్యంత దారుణం



**నందిగామ,జూన్16(మనం న్యూస్):** నందిగామ పట్టణంలోని కాకాని నగర్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించి, బీసీ (గౌడ) సామాజిక వర్గానికి చెందిన పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్ దారుణ హత్యపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన అక్కను వేధించిన వైసీపీ సానుభూతి పరుడిని ప్రశ్నించినందుకు అమర్నాథ్ గ్ని పెట్రోల్ పోసి సజీవ దహనం చేయడం అమానుషమైన, హృదయ విదారక ఘటన అని పేర్కొన్నారు. సమాజాన్ని కలచివేసిన ఈ సంఘటనలో బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలిచిందని తెలిపారు. అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమర్నాథ్ సోదరి హేమశ్రీ ఉన్నత విద్యకు పూర్తి బాధ్యత వహిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయంతో పాటు దీర్ఘకాలిక భరోసా కల్పించడం ద్వారా టీడీపీ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని మరోసారి నిరూపించిందన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 23 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**▶▶ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి ఆంజనేయులు**

**ఇబ్రహీంపట్నం,జూన్16(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రైతు 23 వ రాష్ట్ర మహాసభలు ఏలూరు జిల్లాలో జులై 3,4,5 తేదీల్లో రైతులకు గిట్టుబాటు ధర , సబ్సిడీకి విత్తనాలు,ఎరువులకు ఫేస్ యాప్, బ్యాంకు రుణాలు మంజూరు లాంటి ప్రధాన అంశాలపై చర్చించును నట్లు ఈరోజు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా విస్తృత్ సమావేశం మంగళవారం ఇబ్రహీంపట్నం కామ్రేడ్ వెలగా లక్ష్మణరావు భవన్ నందు రైతు సమస్యలపై చర్చించడం జరిగిందని ఈనెల 22న వ్యవసాయాన్ని నమ్ముకున్న అన్నదాతలను ప్రభుత్వం ఫేస్ యాప్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తుంది. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దేవుడు ఎరుగు కనీసం సాగుకు అవసరమైన ఎరువులు కూడా సకాలంలో అందించడంలో ప్రభుత్వం విఫలమైందని తక్షణమే ఎరువులు ప్రతి రైతుకు అందించాలని డిమాండ్ చేశారు. రైతు సేవ కేంద్రం ద్వారా ఎరువులు అందించాలని మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తానన్న ప్రభుత్వం క్వింటా 1750 రూ అమ్మితే మద్దతు ధర 2400/-రూ రూపాయలు ఉంటే వ్యత్యాసం ప్రతి రైతు అకౌంట్లో 650/- రూపాయలు క్వింటాకు జమ చేయాలని డిమాండ్ చేశారు. పంటలన్నిటికీ ఉచిత భీమా సౌకర్యం కల్పించాలని నష్టపోయిన పత్తి మామిడి రైతులకు ఎకరాకు 10 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని , ధాన్యం రైతులకు ఎకరాకు 10 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఈరోజు జరిగిన విస్తృ సమావేశంలో చర్చించి రైతు సమస్యలపై పోరాడేందుకు పిలుపునిచ్చారు.

### డిమాండ్స్

1) ఎరువులు విత్తనాలు యాప్ తో సంబంధం లేకుండా ప్రతి రైతు కు తక్షణమే ఇవ్వాలి 2) పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి 3) రైతు రుణమాఫీ చేయాలి బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి 4) పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి 5) పెండింగ్లో ఉన్న మొక్కజొన్న రైతుల బకాయిలు చెల్లించాలి 6) అన్నదాత సుఖీభవ రైతులకు కౌలు రైతులకు బ్యాంకు ద్వారా జమ చేయాలి. 7) కౌలు రైతులందరికీ రైతు ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలి 8) నాణ్యమైన విత్తనాలు ఎరువులు రైతులకు అందించాలి 9) ప్రైవేట్ నర్సరీల నియంత్రించాలి.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం వెంకటరెడ్డి , కౌలు సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి వెంకటేశ్వరరావు , రైతు సంఘం ఉపాధ్యక్షులు మద్ది రెడ్డి మాధవరెడ్డి , వజ్రాల వెంకటరెడ్డి , మండేపూడి చంద్రశేఖర్ , ఆళ్ల అమ్మిరెడ్డి , రావుల రామకృష్ణ , రావుల సుబ్బారావు , గోగులముడు అప్పిరెడ్డి ,తుమ్మల నాగేశ్వరరావు, చాట్ల రవి, కొల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.సీ.సీ ఏటీసీ-11,ఏటీసీ-13 శిబిరాల కేడెట్లకు ఫైరింగ్ శిక్షణ విజయవంతం



**మైలవరం, జూన్ 16 మనం న్యూస్:** ఆర్జీయూకేటీ నూజివీడు లో నిర్వహించబడు తున్న ఎన్సీసీ వార్షిక శిక్షణ శిబిరాలు (ఎ టి సి 11 మరియు ఏ టి సి 13) లో పాల్గొంటున్న కేడెట్లకు (వివిధ కళాశాలలు, యల్.బి.ఆర్. సి.ఈ మరియు వివిధ స్కూల్స్ నుండి విచ్చేసిన విద్యార్థులకు ఈ నెల 4వ తేదీ నుండి 5వ తేదీ వరకు మరియు 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు ఫైరింగ్ శిక్షణ లకిరెడ్డి బాలిరెడ్డి కళాశాలలో విజయవంతంగా నిర్వహించబ డింది. ఈ ఫైరింగ్ శిక్షణ కోసం ఎల్బీఆర్సీఈ ఫైరింగ్ రేంజ్ను వినియోగించారు. ఎ టి సి -11 శిబిరానికి చెందిన మొత్తం 588 మంది కేడెట్లు మరియు ఎ టి సి -13 శిబిరానికి చెందిన 540 మంది కేడెట్లు కూడా విజయ వంతంగా ఫైరింగ్ శిక్షణను పూర్తి చేశారు. అనుభవజ్ఞులు ఐన ఎన్సీసీ అధికారులు మరియు శిక్షకుల పర్యవేక్షణ లో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించ బడింది. ఫైరింగ్ శిక్షణ ద్వారా కేడెట్లలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు ఆయుధాల నిర్వహణపై అవగాహన పెంపొందించ డమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టబడింది. ఈ సందర్భం గా అధికారులు ఫైరింగ్ కార్యక్రమం విజయ వంతంగా పూర్తయినందుకు కేడెట్లను అభినందించి, భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎన్సీసీ శిక్షణా అధికారులు, ఎన్.సి.సి విద్యార్థులు మరియు ఇన్ ఛార్జ్ పవిత్ర లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వసంత ప్రజాదర్బార్



**▶▶ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి హామీ**

**▶▶ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలకు ఆదేశం**

**మైలవరం జూన్ 16 మనం న్యూస్:** స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఉదయం నుంచే కార్యాలయానికి చేరుకున్న నియోజకవర్గ ప్రజల నుంచి ఆయన నేరుగా వినతి పత్రాలను స్వీకరించారు. భూ వివాదాలు, పింఛన్లు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తదితర అంశాలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ప్రతి అర్జీదారుడితో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి సమస్యల వివరాలను కూలంకషంగా తెలుసుకున్నారు. పలు సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తన దృష్టికి సమస్యలను తీసుకు రావాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి వారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజాదర్బార్కు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వృద్ధులు, మహిళలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి వినతిపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే చొరవతో తమ సమస్యలు పరిష్కారము అవుతాయనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి ఎమ్మెల్యే వసంత పెద్దపీట

**▶▶ వసంతకు కృతజ్ఞతలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సభ్యులు**

**మైలవరం, జూన్ 16 మనం న్యూస్:** స్థానిక నియోజకవర్గంలో ఉన్న జర్నలిస్టులందరికీ హెల్త్ స్కీమ్ కట్టిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఎ పి ఎం పి ఏ ) సభ్యులు శాసనసభ్యుని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే వసంతను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఒకొక్క జర్నలిస్టుకు హెల్త్ స్కీం నిమిత్తం రూ.1250 చొప్పున సుమారు 150 మందికి పైగా హెల్త్ స్కీం నిమిత్తం ఆర్థిక తోడ్పాటును ఎమ్మెల్యే వసంత కల్పించడం జరిగింది. వచ్చే ఏడాది కూడా హెల్త్ స్కీం కోసం ఆయన ఆర్థిక తోడ్పాటును కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే గా వచ్చినప్పటి నుంచి జర్నలిస్టుల స్థలాల విషయంలో కరోనా సమయంలో, వివిధ రూపాలలో అనేక సహాయాలు తోడ్పాటును అందిస్తూ వసంత జర్నలిస్టుల పట్ల అంకిత భావంతో పనిచేస్తున్నారని యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు విజయ్ బాబు, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి మల్లెల శ్రీనివాసరావు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పామర్తి సత్య, జిల్లా జాయింట్ సెక్రటరీ మన్నే సాంబశివరావు, ప్రెస్ క్లబ్ కోశాధికారి మల్లాది తిరుపతిరావు, మాజీ అధ్యక్షుడు గుంజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# సోషల్ మీడియాపై అణిచివేతకు నిరసన




**▸▸ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే చర్యలు ఆపాలి**

**▸▸ దేవినేని అవినాష్**

**విజయవాడ, తూర్పు జూన్ 16 (మనం న్యూస్):** రాష్ట్రంలో సోషల్ మీడియా వేదికలపై కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న అణిచివేత చర్యలు, అక్రమ కేసులు, ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనలను నిరసిస్తూ వైఎస్సార్సీపీ సోషల్ మీడియా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామిదాసు, రాష్ట్ర సోషల్ మీడియా ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ దొడ్డ అంజిరెడ్డి, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షురాలు పగిడిపాటి చైతన్య, మాజీ జెడ్పీ చైర్పర్సన్ నల్లగట్ల సుధారాణితో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.రాష్ట్రంలో సోషల్ మీడియా ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సాధారణ ప్రజలపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని విమర్శించారు. ప్రజల గొంతుకగా నిలుస్తున్న సోషల్ మీడియాను అణచివేసేందుకు భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడటం రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై దాడి చేయడమేనని అన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం, సోషల్ మీడియా కార్యకర్తలను వేధించడం, పోలీసు వ్యవస్థను రాజకీయ కక్షసాధింపునకు వినియోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎత్తిచూపే స్వరాలను అణచివేయడం ద్వారా ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్సార్సీపీ అన్ని స్థాయిల్లో పోరాటాన్ని కొనసాగిస్తుందని దేవినేని అవినాష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలి

**▸▸ అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి**

**▸▸ బీఎల్ఓలకు సూచన ఎమ్మెల్యే వసంత**



**మైలవరం జూన్ 16 మనం న్యూస్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు స్థానిక బూత్ నెంబర్ 102లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న సవరణ ప్రక్రియపై బీఎల్ఓలు, సూపర్వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పరిశీలించి, డూప్లికేట్ ఓట్లు తొలగించడంతో పాటు మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలి అని ఆదేశించారు. ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించి, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, తొలగింపులు వంటి ప్రక్రియలను పారదర్శకంగా చేపట్టాలని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ఒక్క అర్హుడూ ఓటర్ల జాబితా నుంచి మిస్ కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8ల వినియోగం, ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల బీఎల్ఏలు కూడా బీఎల్ఓలకు సహకరించి సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎలాంటి పక్షపాతానికి తావు లేకుండా స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా మహిళా గ్రీవెన్స్



**▸▸ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు పశ్చిమ జూన్ 16 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేందుకు ప్రత్యేక వేదికగా మహిళా గ్రీవెన్స్ను నిరంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల నుంచి ప్రధానంగా గృహ హింస,వేధింపులు, విద్య, ఉపాధి, ఆరోగ్యం, స్థానిక అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఇప్పటివరకు వచ్చిన సమస్యల్లో దాదాపు 80 శాతం సమస్యలకు పరిష్కారం అందించామని, ప్రతి వారం వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా ప్రత్యేక బృందం పనిచేస్తోందని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో వికాస్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తోందని, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో అభివృద్ధి, ఉపాధి, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గత రెండేళ్లలో రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ, స్ట్రీట్ లైటింగ్,ఆరోగ్య సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. సుమారు 1,500 మందికి జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కల్పించామని, రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మహిళా గ్రీవెన్స్,కార్యకర్తల గ్రీవెన్స్, ప్రజా గ్రీవెన్స్,ఫీల్ విజిట్ల ద్వారా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# షాపుల్లో ఫైర్ సేఫ్టీ తప్పనిసరి

**▸▸ నిబంధనలు పాటించని సంస్థల ట్రేడ్ లైసెన్సుల రద్దు**

**(విజయవాడ, పి.మీరాహుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** విజయవాడ నగరంలోని అన్ని వాణిజ్య సముదాయాలు అగ్నిమాపక భద్రతా నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, నిబంధనలను విస్మరించిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు ట్రేడ్ లైసెన్సులను కూడా రద్దు చేసే చర్యలు తీసుకుంటామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. మంగళవారం ఉదయం రీజినల్ ఫైర్ ఆఫీసర్ సి.హెచ్. రత్నబాబు, జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ మరియు ఫైర్ సిబ్బందితో కలిసి నగరంలోని పలు వాణిజ్య సముదాయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తమకు నివేదికను సమర్పించారని అన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా బందర్ రోడ్డులోని స్వర్ణ హైట్స్, ఖజానా జ్యువెలర్స్, హోటల్ హైయన్తో పాటు ఏలూరు రోడ్డులోని స్వర్ణ ప్యాలెస్లలో అగ్నిమాపక పరికరాల లభ్యత, వాటి పనితీరు, నిర్వహణను పరిశీలించారని, పరిశీలనలో కొన్ని భవనాల్లో అగ్నిమాపక పరికరాలు పనిచేయని స్థితిలో ఉండగా, మరికొన్ని చోట్ల అవసరమైన పరికరాలే లేవని గుర్తించి సంబంధిత యాజమాన్యాలకు అడ్వైజరీ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. నగర పరిధిలోని ప్రతి వాణిజ్య సముదాయంలో ప్రమాణాలకు అనుగుణమైన అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. అలాగే ఆయా సంస్థల్లో పనిచేసే సిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో పరికరాలను ఎలా వినియోగించాలో శిక్షణ, అవగాహన కల్పించడం కూడా యాజమాన్యాల బాధ్యతేనని పేర్కొన్నారు.





# సాయికృష్ణ ఆచూకీ వెల్లడించాలి



**విజయవాడ తూర్పు, జూన్ 16 ( మనం న్యూస్):** కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ ఆచూకీని వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో పాటు ఘటనకు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం జిల్లా అడ్మిన్ డీసీపీకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.గాదె సాయికృష్ణ గత కొన్ని రోజులుగా కనిపించడం లేదని, ఆయన కుటుంబ సభ్యులు పోలీసులపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సాయికృష్ణను కోర్టు ముందు హాజరుపరచాలని ఆదేశాలు వచ్చినప్పటికీ అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులెవరో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విజయవాడ పోలీసుల పనితీరుపై ఇప్పటికే అనేక ఆరోపణలు వస్తున్నాయని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. సాయికృష్ణ ఎలాంటి వ్యక్తి అయినా చట్టపరంగా విచారణ చేసి కోర్టు ద్వారా శిక్షించాల్సి ఉంటుందని, కానీ ఆయన అదృశ్యంపై అనుమానాలు తలెత్తడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. సాయికృష్ణ కనిపించడం లేదని ఆయన తల్లి చెబుతున్న విషయాల ఆధారంగా వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి వద్ద నుంచి తీసుకెళ్లారని కుటుంబ సభ్యులు చెబుతున్నారని, సాయికృష్ణ ఎక్కడ ఉన్నారో పోలీసులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై ప్రభుత్వం, హోంమంత్రి స్పందించాలని డిమాండ్ చేస్తూ, బాధిత కుటుంబానికి వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయోత్సవ సభ విజయవంతం కావాలి



**▸▸ నగర కమిషనర్**

**గుంటూరు నగర పాలక సంస్థ జూన్ 16 (మనం న్యూస్ ప్రతినిధి )**రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 2 ఏళ్లు పూర్తైన సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించే జిల్లా స్థాయి 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి-సంక్షేమం' విజయోత్సవ సభ విజవంతానికి విధులు కేటాయించబడిన ప్రతి విభాగ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కార్యక్రమ నోడల్ అధికారి, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు.మంగళవారం సభ జరిగే జాతీయ రహదారికి చేరువలోని సత్యసాయి నగర్ గ్రౌండ్ ని వివిధ శాఖల అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించి, చేపట్టాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ కూర్చునేలా ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్లను, వీఐపీ గ్యాలరీలను,లబ్ధిదారుల కోసం కేటాయించిన ప్రత్యేక బ్లాకులకు వేరువేరుగా మార్గాలు సిద్ధం చేయాలన్నారు.వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా ఫ్యాన్లు,కూలర్లు, మజ్జిగ ప్యాకెట్లు,తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సభా వేదిక నిర్మాణం,బారికేడ్ల ఏర్పాటు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లు ఉండాలన్నారు.సభకు వచ్చే సాధారణ ప్రజలకు, లబ్ధిదారులకు ఎక్కడా మౌలిక వసతుల కొరత రాకూడదని స్పష్టం చేశారు.సభ విజయవంతం కావడానికి పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ మళ్లింపులు, వాహనాల పార్కింగ్ స్థలాలను ఖరారు చేయాలన్నారు. అత్యవసర అంబులెన్స్ లతో అందుబాటులో ఉంచడంతో పాటు, మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓని ఆదేశించారు. అగ్నిమాపక వాహనాలను కూడా సభా ప్రాంగణంలో ఉంచాలన్నారు.సభా వేదిక, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టాలని, సభలో గ్యాలరీల వారీగా పారిశుధ్య కార్మికులు ఉండేలా చూడాలని జిఎంసి సిఎంఓహెచ్ ని,మహిళలు,పురుషులకు, విఐపీలకు వేరు వేరుగా మొబైల్ టాయ్ లెట్స్ ఏర్పాటు చేయాలని ఎస్ఈని ఆదేశించారు. సభా ప్రాంగణంలో వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ని ఏర్పాటు చేయడానికి తగిన స్థలాన్ని కేటాయించాలన్నారు. పర్యటనలో ఆర్డీఓ శ్రీనివాసరావు,డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు వివిధ విభాగాల అధికారులు పాల్గొనారు.

# బీ.ఎల్.ఓలు బాధ్యతగా వ్యవహరించాలి



**▸▸ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు పశ్చిమ జూన్ 16: (మనంప్రతినిధి)**: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఖఐఖ) ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీ.ఎల్.ఓలు) బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా కృషి చేయడంతో పాటు, నిరక్షరాస్యులు మరియు అవగాహన లేని వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో బీ.ఎల్.ఓ ద్వారా ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్వయంగా తమ ఎన్యుమరేషన్ ఫారాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు అని, ప్రజలు ఖఐఖ ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించి తమ ఓటును పదిలపరచుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు అండగా తెలుగుదేశం పార్టీ నాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అవసరమైతే తన క్యాంప్ కార్యాలయాన్ని కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.ప్రతి అర్హుడి ఓటు జాబితాలో కొనసాగడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని,ఈ ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

# రైతులకు ఎరువుల కొరత రాకుండా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

- **ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు**
- **జులై చివరి నాటికి గ్రీన్ గుంటూరు కార్యక్రమంలో లక్ష మొక్కల నాటడం లక్ష్యం**
- **రైతుల ఆదాయం పెంచటమే వ్యవసాయ అధికారుల లక్ష్యం కావాలి**
- **జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ**

**గుంటూరు, జూన్ 16: (మనంప్రతినిధి)**: జిల్లాలో రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత ఎట్టి పరిస్థితుల్లోనూ రాకుండా జిల్లా మరియు మండల స్థాయిలలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్లోని విసి హాల్లో వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.రానున్న ఖరీఫ్ సీజన్ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎరువుల నిల్వలు, పంపిణీ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని,ఎరువులు అందలేదని ఏ ఒక్క రైతు నుండి ఫిర్యాదు వచ్చినా,సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. రెవిన్యూ, వ్యవసాయ,పోలీస్ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు ప్రతి మండలంలో సమావేశం నిర్వహించి యూరియా సక్రమ పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు.అదేవిధంగా వాతావరణ మార్పుల నేపథ్యంలో ఎల్ నినో ప్రభావం రైతులపై ప్రతికూలంగా పడకుండా.వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, నీటి వినియోగ సామర్థ్య పెంపు, రైతులకు సాంకేతిక సలహాలు అందించే చర్యలను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పంట పెట్టుబడి ఖర్చు తగ్గించి, రైతు ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయడానికి కృషి చేస్తున్నామన్నారు.రైతులకు ఆదాయం పెంచటమే వ్యవసాయ అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు. సంప్రదాయ పంటలతో పాటు అధిక లాభదాయక పంటలు, ఉద్యానవన పంటలు, విలువ ఆధారిత వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. రైతులకు మార్కెట్ అవకాశాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని, రైతులకు అవసరమైన అన్ని సేవలు సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.అలాగే జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్న గ్రీన్ గుంటూరు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు.జులై నెలాఖరు నాటికి కనీసం లక్ష మొక్కలను నాటే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పొలంగట్లు, చెరువుల గట్ల మీద మొక్కలు నాటే కార్యక్రమం,రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ కార్యాలయాలు,విద్యాసంస్థలు, గ్రామాలు,పట్టణ ప్రాంతాలల్లో విస్తృత స్థాయిలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి,జిల్లా ఉద్యానవన శాఖాధికారి రవీంద్ర బాబు, ఏపీఎంఐపి పి డి వజ్రశ్రీ, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ చౌదరి, మార్క్ ఫెడ్ డిస్టిక్ మేనేజర్ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ బాక్సింగ్ పోటీలకు కార్తికేయ ఎంపిక



**గుంటూరు జూన్ 16 (మనం న్యూస్ ప్రతినిధి)**: జూనియర్ బాల బాలికల జాతీయ బాక్సింగ్ పోటీలకు 70 కేజీల విభాగంలో గుంటూరు జిల్లాకు చెందిన కార్తికేయ ఎంపికైనట్లు గుంటూరు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు,వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్ తెలిపారు. మంగళవారం ఉదయం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన అసోసియేషన్ సభ్యులతో కలిసి మాట్లాడారు.ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో కార్తికేయ బంగారు పథకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ధర్మచరణ్ పేర్కొన్నారు.పంజాబ్ రాష్ట్రం జలంధర్ లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ లో ఈ పోటీలు ఈనెల 22 నుంచి 30 వ తేదీ వరకు జరగనున్నాయన్నారు.ఈ పోటీలలో పాల్గొనే కార్తికేయకు వేద సీడ్స్ తరపున సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ 10వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ పోటీలలో కూడా కార్తికేయ రాణించి బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచిన కార్తికేయను అభినందించారు.కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ కోలా చిరంజీవి,గంధం వెంకటేశ్వరావు,ఎం. రాజేశ్వరావు,కోచ్ ఇమ్మానియేల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మను దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు భాష్యం



**విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 16 ( మనం న్యూస్ )**: ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన భాష్యం రామకృష్ణ మంగళవారం మధ్యాహ్నం తన సతీమణితో కలిసి ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వి.కె. శీనానాయక్ భాష్యం రామకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా ఇంద్రకీలాద్రిని సందర్శించిన భాష్యం రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం



**మచిలీపట్నం: జూన్ 16 (మనం న్యూస్):** ప్రభుత్వ టీచింగ్ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యతను పెంచడం, మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రధాన లక్ష్యాలుగా కమిటీ పనిచేయనుంది. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంవో) డాక్టర్ జి. భానుమూర్తి సమర్థవంతంగా పర్యవేక్షించారు. సభా నిర్వహణ, కార్యక్రమ ఏర్పాట్లను సమన్వయం చేస్తూ కార్యక్రమం సజావుగా జరిగేలా కీలక పాత్ర పోషించారు.ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఐఏఎస్ (భారత పరిపాలన సేవలు) చైర్మన్గా, శాసనసభ్యులు కొల్లు రవీంద్ర సహ చైర్మన్గా వ్యవహరించనున్నారు. ప్రభుత్వ టీచింగ్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టీ. లీలా ప్రసాద్ సభ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ ఏ. విష్ణువర్ధన్ (వైద్య విద్య సంచాలకులు), సామాజిక సేవా ప్రతినిధులు బోయిన వెంకట కృష్ణమూర్తి, లింగం విజయ్, భూపతి త్రిపుర, సామాజిక కార్యకర్త ప్రతినిధి విక్రుతి సాయి బాబు, సంస్థాగత సేవలు, సామాజిక సేవా రంగ ప్రతినిధి ఎండీ బాషా ఉన్నారు.అలాగే మున్సిపల్ కమిషనర్ సీహెచ్వీవీఎస్ భాపిరాజు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ వీ. స్వర్ణలత, ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. గోవిందయ్య, జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ ఏ. శేషు కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. ఉగంధర్ కమిటీ సభ్యులుగా కొనసాగనున్నారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పన, సేవల నాణ్యత పెంపు, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# సాయికృష్ణ మిస్సింగ్ పై సమాధానం చెప్పాలి

**కాంగ్రెస్ నేతల డిమాండ్..**




**విజయవాడ,జూన్,16,(మనం న్యూస్):** రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ గాడితప్పుతుందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు,సాయికృష్ణ మిస్సింగ్ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీసీసీ ఉపాధ్యక్షులు, అడ్మినిస్ట్రేషన్ ఇన్ ఛార్జ్ కొలనుకొండ శివాజీ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరశెట్టి నరసింహ రావు, మీసాల రాజేశ్వరరావు, భేగ్, వేముల శ్రీనివాస్. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో గాదె సాయి కృష్ణ మిస్సింగ్ పై నగర ఉన్నతాధికారులు, డిపార్ట్మెంట్ వాళ్ళు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటివరకు ఏఫ్ఐఆర్ నమోదు చేయలేదు, కుటుంబసభ్యులు వెళ్లి గట్టిగా అడిగితే సంబంధిత పోలీస్ లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం అని చెప్పారు. పోలీస్ స్టేషన్ సంబంధించిన కాల్ రెకార్డ్ లు లేదా సిసి కెమెరా రికార్డు లు డిలీట్ చేయకుండా కోర్ట్ కి, ప్రజలకి విడుదల చేయమని నగర పోలీస్ కమీషనర్ వారిని డిమాండ్ చేస్తున్నాము. పోలీస్ స్టేషన్ లో, కస్టడీలో వున్న మనిషి మిస్ అయ్యాడు, కాబట్టి ఈ కేసుపై జ్యూడిషియల్ ఎంక్వయిరీ చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. చనిపోయిన మనిషి గురించి పట్టించుకోకుండా మాయమాటలు చెప్తున్నారు. గాదె సాయి కృష్ణ కేసులో బాధ్యులపై 302 కేసు పెట్టి అరెస్ట్ చేసి రికార్డు లు సీజ్ చేయండి. పవన్ కళ్యాణ్ గారు ఢిల్లీ లో దేశ సమగ్రత కోసం పార్టీ పెట్టానని చెప్పడం హాస్యాస్పదం. మోకాలుకి, బోడిగుండుకు లింక్ పడుతున్నట్లుంది ఆయన మాటలు. రాష్ట్ర విభజన సమయంలో అంగీకారం తెలిపిన వాళ్ళు నేడు ఈ విభజనకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే కారణం అని వేలెత్తి చూపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మీద తమ అక్కసును వెళ్లగక్కుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇష్టంవచ్చినట్లు అప్పులు చేసి దుబారా చేస్తున్నారు. ఈ భారం అంత పడేది ప్రజల మీదే. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రాన్ని ఆదుకోవడానికి గ్రాంటు ఇచ్చినట్లు ఎక్కడ కనిపించడం లేదు. గతంలో ముఖ్యమంత్రిగా వున్న జగన్ మోహన్ రెడ్డి చేసిన అప్పుకంటే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన అప్పే ఎక్కువ. చేసిన అప్పుల తాలూకు డబ్బు ఎక్కడికి వెళుతుందో ప్రజలకు చెప్పాలి. సుగాలి ప్రీతి కేసులో అన్యాయం జరిగిందని గతంలో పవన్ కళ్యాణ్ , తరువాత జగన్మోహన్ రెడ్డి అందరు కూడా గగ్గోలు పెట్టారు. అనంతబాబు తన డ్రైవర్ని చంపి డోర్ డెలివరీ చేసాడు, ఈ విషయంపై అందరు మాట్లాడారు. కానీ గాదె సాయి కిష్ణ ని పోలీస్ స్టేషన్ లో లాకప్ లో చిత్రహింసలు పెట్టి అతను చనిపోతే కనీసం ఏఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. ఈ విషయంపై ఎవరు మాట్లాడటం లేదు. డాలర్ విలువ పడిపోవడానికి, పెట్రోల్, డీజిల్ రేట్లు పెరగడానికి బిజెపి ప్రభుత్వ వైఫల్యమే కారణం. అహ్మదాబాద్ మెట్రో రైల్ కి వేలకోట్లు రోపాయలు నిధులు కేటాయించడం జరిగింది. కానీ విభజన హామీలో చేర్చిన విజయవాడ మెట్రో లైన్ కి ఇంతవరకు నిధులు కేటాయించలేదు. పవన్ కళ్యాణ్ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోతున్నారు. మీ అసమర్థ పాలన గురించి మాట్లాడిన వారిపై కేసులు పెడుతున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజీత్ దీప్కేపై మరియు తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మరియు నాయకులపై జరిగిన దాడిని ఖండిస్తున్నాము. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న బిజెపి ప్రభుత్వ తీరుకు నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి.నీట్ పేపర్ లీక్ కి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా ర్యాలీలు, బహిరంగ సభలు పెడుతున్నారు. అందులో భాగంగా ఈనెల 17 వ తేదీన కోట లో జరుగుతుంది. దీనికి రాష్ట్ర కాంగ్రెస్ తరపున సంఘీభావం తెలుపుతున్నాము.కోట లో జరగబోవు సభకు సంబంధించిన పోస్టర్ రిలీజ్ చేశారు.

# జిల్లాలో పారదర్శకంగా సర్ ప్రక్రియ

**ఇంటింటి సర్వేను పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ**

**విజయవాడ రూరల్, జూన్,16,(మనం న్యూస్):** అర్హులైన ప్రతి పౌరుడికీ ఓటు హకు కల్పించడంతో పాటు ఎలాంటి తప్పులు లేని పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాలకు అనుగుణంగా చేపట్టిన సర్ ప్రక్రియ జిల్లాలో సజావుగా సాగుతోందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం నందిగామ మండలం, ఐతవరంలో బీఎల్వోలు ఇంటింటి సందర్శనల ద్వారా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. కీలకమైన ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని.. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో ఓటర్లకు సహకరించాలన్నారు. జిల్లాలో 1,792 మంది బీఎల్వోలు ఉన్నారని.. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వే ముగిసిన అనంతరం జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్లు, అబ్జెక్షన్ల స్వీకరణ ఉంటుందని.. ఆ తర్వాత వీటిని పరిష్కరించి ఈ ఏడాది సెప్టెంబర్ 22న తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చురుగ్గా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.



# సుపరిపాలనకు 2 ఏళ్ళు కార్యక్రమానికి సంబంధించి, సభాప్రాంగణం వద్ద ఏర్పాటు చేయనున్న స్టాల్స్ సుపరిపాలన పై సందేశాత్మకంగా ఉండాలని నగర కమిషనర్



**గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 16 (మనం న్యూస్ ప్రతినిధి)** సుపరిపాలనకు 2 ఏళ్ళు కార్యక్రమానికి సంబంధించి, సభాప్రాంగణం వద్ద ఏర్పాటు చేయనున్న స్టాల్స్ సుపరిపాలన పై సందేశాత్మకంగా ఉండాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు.మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో సుపరిపాలనకు 2 ఏళ్ళు సభా కార్యక్రమానికి సంబందిచి విధులు కేటాయించబడిన వివిధ శాఖల అధికారులతో స్టాల్స్ ఏర్పాటు పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 2 ఏళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారికి చేరువలోని సత్యసాయి నగర్ గ్రౌండ్ లో నిర్వహించే జిల్లా స్థాయి 'సుపరిపాలనకు 2 ఏళ్ళు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు.ఈ సభ విజవంతానికి విధులు కేటాయించబడిన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరగుతారని,కావున సభా ప్రాంగణంలో అధికారులు వారి వారి శాఖలు ఈ రెండు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని వివరిస్తూ మరియు సందేశాత్మకంగా స్టాల్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్,పోలీస్ డిపార్ట్ మెంట్ వారు, సి.ఆర్.డి.ఏ, అగ్రికల్చర్, సివిల్ సప్లైస్,డి.ఆర్.డి.ఏ, హ్యాండ్ లూమ్స్ తదితర శాఖల వాళ్ళు ఈ రెండు సంవత్సారాలలో సాధించిన ప్రగతిని వివరిస్తూ స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జియంసి సియంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, యంహెచ్ఓ డాక్టర్ సురేష్, డి.యస్.పి శ్రీనివాస రెడ్డి, ఆర్.టి.జి.యస్ డిప్యూటీ సిఈఓ మాధురి,వ్యవసాయ శాఖ డి.ఎ.ఓ పద్మావతి,హ్యాండ్లూమ్స్ డి.ఓ శ్రీధర్ బాబు,సివిల్ సప్లైస్ ఎసియస్ఓ ఆచార్యులు, స్వచ్ఛాంధ్ర కార్పోరేషణ్ పిఓ నాగేశ్వర రావు,సిఆర్డిఏ జాయింట్ డైరెక్టర్ రామ రాజు, సిఆర్డిఏ చీఫ్ ఆర్కిటెక్ సందీప్ దీక్షిత్, తహసిల్దార్ సునీల్, సిఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.





# ఒత్తిడిని జయించి.. కార్యదక్షతను పెంచి..

**మీడియా వృత్తిలో సమతుల్యతకు యోగానే మార్గం**
**ఆరోగ్యవంతమైన మీడియా సమాజానికి నిత్య యోగా దివ్య ఔషధం**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**







**విజయవాడ,జూన్,16(మనం న్యూస్)ః** ప్రస్తుత వేగవంతమైన మీడియా రంగంలో పనిచేస్తున్న పాత్రికేయులు, ఫొటోగ్రాఫర్లు, ఇతర మీడియా ప్రతినిధులు నిరంతరం ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని.. ఇలాంటి పరిస్థితిలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి యోగా సాధన ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర-2026లో భాగంగా మంగళవారం హరిత బెరం పార్కులో జరిగిన మీడియా థీమ్ యోగా కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే సమగ్ర జీవన విధానమని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. మీడియా ప్రతినిధులు నిరంతరం ఒత్తిడి, సమయపాలన, క్షేత్రస్థాయి విధుల కారణంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటారని, అలాంటి పరిస్థితుల్లో యోగా వారికి శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందించడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించి పనితీరును మరింత మెరుగుపరచుకోవచ్చని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమాలను కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని.. ఇదేవిధంగా యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేసి ప్రజలను యోగా సాధన వైపు మరింతగా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.జయరాజు, ఉపాధ్యక్షులు చావారవి, సీనియర్ పాత్రికేయులు ఎం.గాంధీబాబు, వైవీవీ వరప్రసాద్, సీహెచ్ విజయభాస్కర్, సీహెచ్ నారాయణరావు, డీవీ రమణ, వైడీ ఆనంద్, సోషల్ మీడియా ప్రతినిధులు కిరణ్, నంద, మహేష్ తదితరులతో పాటు డీఐపీఆర్వో కేవీ రమణరావు, జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్నప్రియదర్శిని, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి బి.ప్రభాకరరావు, యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్, డీఎస్డీవో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







# గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నూతన భవన సముదాయాల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారని మర్యాదపూర్వకంగా కలిసిన సిపిఐ జాతీయ నాయకులు



**గుంటూరు జూన్ 16 (మనం న్యూస్ ప్రతినిధి)**: గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నూతన భవన సముదాయాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ రాఘువ శర్మ కి,డాక్టర్ విజయ శర్మ కి మంగళవారం శుభాకాంక్షలు తెలియజేసిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు,జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్..డాక్టర్ రాఘువ శర్మ దంపతులు మూడు దశాబ్దాలకు పైగా గుంటూరు కేంద్రంగా అందిస్తున్న సేవలు ప్రజలు మరచిపోలేరని వారి హాస్పిటల్ కార్పొరేట్ స్థాయికి పెరిగినా వైద్యం అందించటంలో పేషెంటు, డాక్టర్ అనుబంధాన్ని కొనసాగించడంలో సాధారణ స్థాయిలో ఉండటం హర్షనీయమని ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొంటూ పుష్పగుచ్చం ఇచ్చి దుశ్యాలతో ఇరువురు డాక్టర్లను వారు సత్కరించారు.



# ద్విచక్రాల వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడు అరెస్ట్

**తాడేపల్లి, జూన్ 16, మనం న్యూస్**: ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడుతున్న వి పూరి అజయని తాడేపల్లి పోలీస్ వారు అరెస్ట్ చేసి 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ వీరేంద్రబాబు మాట్లాడుతూ తాడేపల్లి, మంగళగిరి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు చేసినట్లు వివరించారు. ప్రజలు తమ వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో పార్కు చేయాలని వాహనాలకు భద్రతా పరికరాలు వినియోగించాలని అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని సిఐ రవీంద్రబాబు తెలియజేశారు.



# అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



- **యోగా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యోగా గురువు బాబా రాందేవ్ హాజరు**
- **ఐజీఎంసీ స్టేడియంతోపాటు డా. బిఆర్ అంబేద్కర్ కళా వేదికలోనూ ఏర్పాట్లు**
- **జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

**(విజయవాడ,మనం బ్యూరో)**: జూన్ 21న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిధులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ బాబా లు హాజరు కానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను మం గళవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే.ఎస్. విశ్వనాథన్, నగర మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎమ్ ధ్యానచంద్ర, నగర డీసీపీ కృష్ణకాంత్ పటేల్, ఏడీసీపీ ఎస్పీఎమ్ మురళీ కృష్ణ, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు మంతెన వెంకట సత్యనారాయణ రాజు, ప్రకృతి వైద్య ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు, యోగా గురువు బాబా రాందేవ్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం డా. బీఆర్. అంబేద్కర్ కళా వేదికకు చేరుకుని అక్కడ చేస్తున్న ఏర్పాట్లు, ప్రొటోకాల్ తదితర అంశాలపై వారితో కలెక్టర్ చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ... దాదాపు 5 వేల మందికిపైగా యోగా సాధకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగు నీరు, వైద్య సేవలు వంటి తగిన ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, ఆయుష్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా డా. బీఆర్ అంబేద్కర్ కళా వేదికలోనూ యోగా నిర్వహించేలా ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం అక్కడ కూడా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాఖల సమన్వయంతో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం చేసేందుకు యోగాలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

# క్లీన్ బెజవాడ ..కమిషనర్ టార్గెట్

**విజయవాడ నగర మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర టార్గెట్ ... క్లీన్ బెజవాడ అందుకోసం నిత్యం ఆయన ప్రత్యేక శ్రద్ధతో నగర పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో కమిషనర్ పరిశీలిస్తున్నారు.**



**(విజయవాడ, పి.మీరాహుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి)**: విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం మహాత్మా గాంధీ రోడ్, లోబ్రిడ్జి, బీఆర్టీఎస్ రోడ్డు, కృష్ణవేణి క్లాత్ మార్కెట్, నైజాం గేట్, గాంధీ హిల్ ప్రాంతాలలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల తొలగింపు, కాలువల శుభ్రత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా పంజా సెంటర్ సమీపంలోని కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సజావుగా పనిచేసేలా పూడిక తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పూడిక తొలగింపునకు వినియోగిస్తున్న యంత్రాల పనితీరును కూడా పరిశీలించారు. అనంతరం నైజాం గేట్ ప్రాంతంలో కాలువల్లో తేలియాడుతున్న వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, వ్యర్థాల తొలగింపు చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగరంలోని ప్రధాన కాలువలు, డ్రైన్లు, ప్రజా ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్త సేకరణ, వ్యర్థాల తొలగింపు, కాలువల శుభ్రత కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించాలని కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తదుపరి వన్ టౌన్ లోని గాంధీజీ మహిళా కళాశాల సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ను కమిషనర్ ధ్యానచంద్ర క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్లో అందిస్తున్న ఆహార నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ, వంటశాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా తదితర అంశాలను స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్న క్యాంటీన్కు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా తాగునీటి సరఫరాలో ఎలాంటి అం తరాయం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే క్యాంటీన్ నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రజలు ఎదుర్కొనే ఏవైనా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె. శ్రీనివాస్, గోపాల కృష్ణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.



## ఏపీఎయిమ్స్‌తో సమగ్ర వ్యవసాయ
# సాంకేతికత

**అన్నదాతలు యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి**
**ఎరువుల సరఫరాలో పారదర్శకతకు పెద్దపీట**
**క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు నిర్వహణ**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



నందిగామ,జూన్,16,(మనం న్యూస్): ఏపీ వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ (ఏపీఎయిమ్స్) యాప్తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని.. సమగ్ర వ్యవసాయ సాంకేతికత అండతో అన్నదాతలు సాధికారత దిశగా ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం నందిగామలో మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. యాప్ ద్వారా ఎరువుల అమ్మకం ప్రక్రియను పరిశీలించారు. ఈ యాప్పై రైతుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ విధానం బాగుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఏ డోసుకు ఆ డోసు బాగానే అందుతోందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పటిష్ట ప్రణాళికతో డేటా విశ్లేషణతో ఎరువులకు ఇండెంట్ ఇవ్వడం జరిగిందని.. సీజన్లో ఏ సమయంలోనూ ఎరువులకు ఇబ్బందిలేకుండా చూస్తున్నట్లు తెలిపారు. ఎరువులు పక్కదారి అనే మాట లేకుండా అత్యంత పారదర్శక విధానాన్ని అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వారికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ఏపీ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ యాప్ ద్వారా సమగ్ర వ్యవసాయ సాంకేతిక సమాచారం వారి మొబైల్ ఫోన్లోనే అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ యాప్ను ప్రతిఒక్కరూ డౌన్లోడ్ చేసుకోవాలని.. యాప్ ద్వారా రైతులు వ్యవసాయానికి సంబంధించిన అనేక సేవలను సులభంగా తమ మొబైల్ ఫోన్లోనే పొందవచ్చన్నారు. భూ వివరాలు, పంట నమోదు, ఈ-క్రాప్ సమాచారం, పంట బీమా, సబ్సిడీలు, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ పథకాల వివరాలను తెలుసుకోవచ్చని.. అదేవిధంగా వాతావరణ సూచనలు, మార్కెట్ ధరలు, పంటలపై నిపుణుల సలహాలు, వ్యవసాయ శాఖ తాజా సమాచారం కూడా అందుబాటులో ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కలెక్టర్ వెంట మండల వ్యవసాయ అధికారి జి.నాగేశ్వరరావు, తహశీల్దార్ సురేష్బాబు, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి కృషి



**▸▸ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా**

విజయవాడ,జూన్,16,(మనం న్యూస్): మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి, సమగ్ర ఆవిష్కరణలు మరియు జీవనోపాధి అభివృద్ధికి దళిత్ ఫిలాంత్రఫీ ఫౌండేషన్ - రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మధ్య అవగాహన ఒప్పందం2026 జూన్ 16న ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, ఐఏఎస్ సమక్షంలో దళిత్ ఫిలాంత్రఫీ ఫౌండేషన్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విజయవాడ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పంద పత్రాలను దళిత్ ఫిలాంత్రఫీ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ కుమార్ సామల్ , రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ జి. కృష్ణన్ పరస్పరం మార్చుకున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, సమగ్ర ఆవిష్కరణలు, జీవనోపాధి అభివృద్ధి , సామాజిక సంస్థల బలోపేతం కోసం సంయుక్తంగా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా మహిళలు, యువత మరియు వెనుకబడిన వర్గాల ఆర్థిక సాధికారతకు, స్వయం ఉపాధి అవకాశాల పెంపుకు, నైపుణ్యాభివృద్ధికి మరియు సామాజిక ప్రభావం కలిగిన వ్యాపారాల ప్రోత్సాహానికి ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఈ కార్యక్రమం జిల్లాలో మహిళా సాధికారత మరియు సమగ్ర అభివృద్ధికి ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పరిశీలించిన తన్నీరు

జగ్గయ్యపేట జూన్ 16 మనం న్యూస్: జగ్గయ్యపేట మండలం, చిల్లకల్లు గ్రామంలో బూత్ నెంబర్ 79 లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పాల్గొని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పరిశీలించారు.ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ గొర్రెపాటి బుల్లయ్య, బీఎల్వో హారిక మరియు సంబంధిత సిబ్బందితో కలిసి బూత్ల వారీగా కార్యక్రమం నిర్వహణను సమీక్షించారు.బూత్ పరిధిలోని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించి అవగాహన కల్పించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పూర్తిస్థాయి పారదర్శకతతో జరగాలని కోరారు.ఓటర్లలో తమ ఓటు తొలగించబడుతుందేమో లేదా నకిలీ ఓట్లు నమోదవుతాయేమో అనే భయాందోళనలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే బీఎల్వోలు లేదా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు, ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు.రాష్ట్రంలో ప్రారంభమైన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జూలై 14 వరకు కొనసాగుతుందని, ఈ కాలంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు.గతంలో 2014-2019 కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 'సేవా మిత్ర' పేరుతో వైఎస్ఆర్ సీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం 'మై టీడీపీ పాస్పోర్ట్' యాప్ ద్వారా కూడా ఓటర్ల తొలగింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొంటూ, ఈ అంశంపై ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్ మండల రైతు విభాగ కార్యదర్శి గొళ్ళ రామకృష్ణ ఉప్పల రంగ, గాలం గోపి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ టీ సీ బస్ స్టాండ్ లో కనీస వసతులు, పరిశుభ్రత మెరుగుపరచాలి

**▸▸ జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ**



గుంటూర్,జూన్ 16:(మనం న్యూస్ ప్రతినిధి): ప్రజల నుండి అందిన ఫిర్యాదుల మేరకు గుంటూరు ఆర్ టీ సీ బస్ స్టాండ్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ కల్పిస్తున్న కనీస వసతులు, పరిశుభ్రతను పరిశీలించారు. బస్ స్టాండ్ లోని వివిధ బ్లాక్ లను పరిశీలించారు.బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్లు, త్రాగునీటి కుళాయిలను, దుకాణాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.స్వయంగా ప్రయాణికులతో మాట్లాడి బస్టాండ్లోని పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం మరియు అందుతున్న సేవలపై ఆరా తీశారు.అనంతరం అధికారులతో మాట్లాడుతూ బస్టాండ్ లోపల,బయట వాతావరణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలని; సురక్షితమైన తాగునీరు అందించాలని , పరిసరాలు బాగుంటేనే ప్రజలు నమ్ముతారని స్పష్టం చేశారు. మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్ల నిర్వహణను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, అన్ని కుళాయిలు పని చేసేలా చూడాలని ఆదేశించారు .జూలై నెలాఖరు నాటికి టాయిలెట్స్ లో కొత్త టైల్స్ అమర్చాలన్నారు. అలాగే ప్లాస్టిక్ టాప్ లను తొలగించి స్టీల్ టాప్ లను ఏర్పాటు చేయాలని ఆర్ టీ సీ , ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. బస్టాండ్ అంతటా తగినన్ని డస్ట్బిన్లను ఏర్పాటు చేయాలని ఆధికారులను ఆదేశించారు. ఆర్టీసీ ప్రాంగణంలోని హోటళ్లు, క్యాంటీన్లలో టీ,వాటర్ బాటిళ్లు, ఇతర వస్తువుల విక్రయాలను, వాటి నాణ్యతను తనిఖీ చేసి, హోటళ్లను పూర్తి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బస్సుల రాకపోకల సమయాలు మరియు ప్రయాణికులకు అవసరమైన ఇతర సమాచారాన్ని ప్రభుత్వ వాట్సాప్ ఆధారిత డిజిటల్ సేవల ద్వారా ప్రదర్శించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి.సామ్రాజ్యం,ఆర్టీఓ కే.శ్రీనివాస రావు,డిపో మేనేజర్,ఆర్ టీ సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు





# స్మార్ట్ వ్యవసాయంతో రైతులకు సాంకేతిక భరోసా

**ఏ ఐ నీటి అనుసంధానం, సంక్షేమ పథకాలతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు**

**ఎస్బీఐ స్మార్ట్ అగ్రి కస్టమర్ మీట్లో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు**

**నరసరావుపేట, జూన్ 16: (మనం న్యూస్ ప్రతినిధి):** వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, నీటి వనరులను సమర్థంగా వినియోగించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని హెచ్-6 ఇన్ హోటల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన స్మార్ట్ అగ్రి కస్టమర్ మీట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవానికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని వివరించారు. రైతుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని, ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.భూగర్భ జలాల అభివృద్ధి,ఆధునిక సాగు పద్ధతుల ప్రోత్సాహం, డిజిటల్ వ్యవసాయ సేవల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

### రైతుకు తోడుగా ఎస్బీఐ

పల్నాడు జిల్లాలో రైతులకు ఎస్బీఐ గణనీయ స్థాయిలో ఆర్థిక సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లాలో రూ.100 కోట్లకు పైగా వ్యవసాయ రుణాలు అందించడంతో పాటు,సాఫ్ట్ అగ్రి టెక్ భాగస్వామ్యంతో మరో రూ.200 కోట్ల రుణాలు మంజూరు చేయడం రైతు రంగానికి ఊతమిచ్చే చర్యగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఎస్బీఐ రీజినల్ మేనేజర్ రవికుమార్ సేవలను ఆయన అభినందించారు.ఏ.ఐ.వ్యవసాయం వైపు అడుగులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీ ఏ ఐ ఎం ఎస్- 2.0 వంటి ఆధునిక వ్యవసాయ సమాచార వ్యవస్థల ద్వారా రైతులకు క్షేత్రస్థాయి సలహాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కృత్రిమ మేధస్సు ఏ ఐ. ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్ సాంకేతికత, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించి పంటల ఆరోగ్యం, వ్యాధుల గుర్తింపు,వాతావరణ హెచ్చరికలు, మార్కెట్ ధరల సమాచారం రైతులకు అందిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ రంగంలో డిజిటల్ పరివర్తన ద్వారా దిగుబడులు పెరగడంతో పాటు సాగు నష్టాలను తగ్గించే అవకాశాలు విస్తరించనున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

### కృష్ణా-గోదావరి అనుసంధానంతో నీటి భద్రత

రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కృష్ణా-గోదావరి నదుల అనుసంధాన ప్రాజెక్టును ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చేపట్టిందన్నారు. గోదావరిలో సముద్రంలో కలిసిపోతున్న అదనపు నీటిని కృష్ణా బేసిన్కు మళ్లించడం ద్వారా సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమతో పాటు రాష్ట్రంలోని నీటి కొరత ప్రాంతాలకు భారీగా ప్రయోజనం చేకూరుతుందని, ఇది భవిష్యత్ తరాలకు నీటి భద్రతను కల్పించే గేమ్చేంజర్ ప్రాజెక్టుగా నిలుస్తుందని చెప్పారు. అన్నదాత సుఖీభవ తో ఆర్థిక అండ రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి అర్హ రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20 వేల వరకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు సహకారం అందించడం రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. సహజ వ్యవసాయానికే భవిష్యత్.ఇటీవలి కాలంలో ఉద్యోగ విరమణ పొందిన పలువురు వ్యవసాయం వైపు మొగ్గు చూపడం శుభపరిణామమని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. అధిక రసాయనాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

## కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి ఆత్మీయ స్వాగతం

## ఎమ్మెల్యే సుజనా క్యాంపు కార్యాలయంలో విందు

**విజయవాడ తూర్పు జూన్ 16 ( మనం న్యూస్):** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి విజయవాడ పర్యటన సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆత్మీయ స్వాగతం పలికారు. మంగళవారం తాడిగడపలోని తన క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన కేంద్రమంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.అనంతరం ప్రహ్లాద్ జోషిని ఎమ్మెల్యే సుజనా చౌదరి విందుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అమలవుతున్న సుపరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై వారు అభిప్రాయాలు పంచుకున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాల్సిన అవసరాన్ని నాయకులు ఈ సందర్భంగా ప్రస్తావించారు.



# అభాగ్యులు, ఆపన్నులకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోంది



**ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు పశ్చిమ జూన్ 16 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి (ఇఖఊ) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం రూ.13 లక్షల విలువైన 17 చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. .ముఖ్యమంత్రి సహాయనిధి అభాగ్యులు, ఆపన్నులకు అద్భుతమైన చేయూతగా నిలుస్తోందని అన్నారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపశమనం కలిగిస్తోందని తెలిపారు. సహాయనిధి చెక్కులు అందుకున్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి, ఎన్టీఆర్ వైద్య సేవల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఆసుపత్రి బిల్లుల చెల్లింపులను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు అవసరమైన వారికి సహాయనిధి చెక్కులు త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటివరకు 597 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.8 కోట్ల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రాణాలకు సంబంధించిన అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని, ఇలాంటి సంక్షేమ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి లబ్ధిదారుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.



# వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్

**అమరావతి అభివృద్ధికి కేంద్రం పూర్తి మద్దతు: ప్రహ్లాద్ జోషి**

**విజయవాడ పశ్చిమ జూన్ 16 ( మనం న్యూస్ ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. విజయవాడ భవానిపురంలోని వాజపేయి పార్క్లో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్క్లో వాకర్లతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. 2014కు ముందు దేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉండేదని, ప్రస్తుతం ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందన్నారు. రైల్వే విద్యుదీకరణ, మౌలిక వసతుల అభివృద్ధి, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీలో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా దేశీయ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరిగిందన్నారు. అమరావతి రాజధాని అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు. ఇందుకోసం రూ.15 వేల కోట్ల ఆర్థిక సహాయంతో పాటు హడ్కో ద్వారా మరో రూ.11 వేల కోట్ల నిధులు సమకూర్చినట్లు వెల్లడించారు. అమరావతిని దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించే ప్రత్యేక రైల్వే మార్గం కోసం కూడా నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సమన్వయంతో రాష్ట్ర పురోగతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా వికసిత భారత్ లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్రహ్లాద్ జోషి తెలిపారు.



# హోం మంత్రి అనితకు గుడివాడ అమర్నాథ్ వెంటనే క్షమాపణ చెప్పాలి



నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి, యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య

**జగ్గయ్యపేట జూన్ 16 మనం న్యూస్ :** హోం మంత్రి వంగలపూడి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెంటనే హోమంత్రికి క్షమాపణ చెప్పాలని లేదా తెలుగు మహిళ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలియజేసి తగిన గుణపాఠం చెబుతామని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యురాలు కన్నెబోయిన రామలక్ష్మి, యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య లు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ హోం మంత్రి అనిత పై గుడివాడ అమర్నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని అన్నారు. టీచర్ గా వృత్తి నిర్వహిస్తూ రాజకీయాల్లోకి వచ్చి అంచెలంచెలుగా ఎదిగి హోం మంత్రి స్థాయికి ఎదిగిన దళిత మహిళపై చేసిన వ్యాఖ్యలు బాధాకరం అన్నారు. గుడివాడ అమర్నాథ్, ఆయన ఉన్న పార్టీ కూ సంస్కారం కల పార్టీ అని మహిళల పట్ల గౌరవం లేదని అన్నారు. ఆ పార్టీ నేతలు ఏదైనా చేసి వార్తల్లో కనిపించాలని పత్రికలలో ఏదో ఒక మాటలు మాట్లాడి వార్తల్లో ఉండాలని కోరుకుంటారని అన్నారు. మాజీ మంత్రి అయ్యుండి అమర్నాథ్ ఆడవారి చీరల పైన వారి మేకప్ గురించి మాట్లాడటం సిగ్గుచేటని గతంలోనూ అమరావతి మహిళల కట్టు బొట్టు గురించి ఉచిత వ్యాఖ్యలు చేశారని దాని ఫలితంగా ప్రజలు ఆ పార్టీకి ఏ తీర్పు ఇచ్చారో గుర్తుంచుకోవాలన్నారు. తక్షణం గుడివాడ అమర్నాథ్ హోం మంత్రి అనితకు క్షమాపణలు చెప్పాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళ ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పలువురు తెలుగు మహిళా నేతలు పాల్గొన్నారు.

# బాపులపాడు మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా కొత్తపల్లి డీలర్ వై.లలిత



**హనుమాన్ జంక్షన్ :జూన్ 16: ( మనం న్యూస్ ):** బాపులపాడు మండలం రేషన్ డీలర్స్ నిర్వహించిన సమావేశంలో వేలేరు డీలర్ శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తపల్లి రేషన్ డీలర్ యనుముల లలిత ను డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్ గా రామన్నగూడెం డీలర్ కగ్గ గాంధీ,గౌరవ అధ్యక్షులుగా ఉమామహేశ్వరం డీలర్ ఆరేపల్లి శేఖర్ ,సెక్రటరీగా ఆకునూరి విజయ జ్యోతి, జాయింట్ సెక్రటరీ పాతూరి ఆనంద్ కుమారి, ట్రెజరర్ గా కోలవెంటి చంద్రశేఖర్ కమిటీ సభ్యులుగా మాతంగి కిషోర్,రెడ్డి రఘుబాబు, పసుపులేటి వీరభద్రరావు,వడ్డే రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అనంతరం కొత్తగా ఎన్నుకున్న డీలర్స్ అసోసియేషన్ నాయకులు ఎం ఆర్ ఓ మురళీకృష్ణ ను కలసి పుష్పగుచ్చం అందజేశారు ఎమ్మార్వో బి మురళీకృష్ణ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసి కార్డుదారులకు టైం కి షాపులు తెరిచి 65 సంవత్సరాలు నిండిన కార్డుదారులుకు అందరికి సక్రమంగా సరుకులు అందించాలని ఆదేశించారు.

# రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అవకాశాలు కల్పించాలి

కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషిని కలిసి రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట జూన్ 16 మనం న్యూస్ :** రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు తగిన అవకాశాలు కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషిని కలసి జగ్గయ్యపేట శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ కోరారు. జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి నివాసంలో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ని కలిసి జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలోని రైతుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఈ సీజన్లో వరి దిగుబడి అధికంగా నమోదైందని, రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో ఉప్పుడు బియ్యం (బాయిల్ రైస్) సేకరణకు కేవలం 5 వేల టన్నుల లక్ష్యాన్ని మాత్రమే కేటాయించినట్లు పేర్కొంటూ, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అదనంగా 30 వేల టన్నుల ఉప్పుడు బియ్యం సేకరణ లక్ష్యాన్ని మంజూరు చేయాలని కోరారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తికి సరైన మార్కెట్ లభించేలా భారత ఆహార సంస్థ (ఎఫ్ సి ఐ) ద్వారా అదనపు సేకరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సంక్షేమం దృష్ట్యా ఈ అంశాన్ని అత్యవసరంగా పరిశీలించి, ఎన్టీఆర్ జిల్లాకు అదనంగా 30 వేల టన్నుల ఉప్పుడు బియ్యం సేకరణ లక్ష్యాన్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సమర్పించిన వినతిపత్రంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కోరారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వినతిపత్రాన్ని స్వీకరించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే రాజగోపాల్ తెలిపారు.

# హనుమాన్ జంక్షన్ లో ఘనంగా జరిగిన లయన్ కళ్లేపల్లి జన్మదిన వేడుకలు



**హనుమాన్ జంక్షన్,జూన్ 16 ( మనం న్యూస్ ):** తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న అజాత శత్రువు,రిటైర్డ్ ఉద్యోగి కళ్లేపల్లి నారాయణరావు అభినందనీయుడని విజయా డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మంగళవారం సాయంత్రం హనుమాన్ జంక్షన్ లో పుట్టగుంట కాంప్లెక్స్ లో కళ్లేపల్లి జన్మదిన వేడుకలను స్నేహితుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిగం స్వామి, చలసాని రాజా, త్రిపురనేని సత్యన్నారాయణ, మిక్కిలినేని ఈశ్వరరావు, అక్కినేని రాఘవేంద్రరావు ,పాలడుగు శ్రీధర్,కన్నెగంటి రంగారావు,మిక్కిలినేని అప్పారావు,గొంది శరత్, శొంఠి నాగరాజు, పుట్టగుంట విష్ణు,హనుమంతు నాగేశ్వరరావు ,పాలడుగు పిచ్చేశ్వరరావు సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.కాగా వైస్తవి స్టూడియో లో నారాయణరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ వేడుకల్లో స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్య ప్రసాద్,చక్రపాణి విజయ కుమార్,తాడి రంగారావు, రొంపల్లి అచ్యుతరావు, మోగంటి కొండ,అంబళ్ల వెంకట రంగారావు, గంటా శ్రీనివాస్, గార్లపాటి రాజేశ్వరరావు,తొమ్మండ్రు రమేష్, కొలపల్లి మల్లేశ్వరరావు,లంక రమేష్,కొప్పుల మహేష్ , తవ్వా సురేష్, దాసరి కళ్యాణ్, వల్లభనేని ప్రభాకరరావు,కోలుకొండ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలిపై దాడి ఘటనపై ఆగ్రహం



- గంజాయి ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- సీపీఎం నేతల డిమాండ్

విజయవాడ సెంట్రల్ జూన్ 16 ( మనం న్యూస్)విజయవాడ పాయికాపురం 63వ డివిజన్ పరిధిలోని సుందరయ్య నగర్ కరకట్టపై 70 ఏళ్ల వృద్ధురాలిపై జరిగిన దాడి, లైంగిక వేధింపుల యత్నం ఘటనపై సీపీఎం నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి మత్తులో ఉన్న ఓ దుండగుడు అర్ధరాత్రి సమయంలో వృద్ధురాలిపై దాడి చేసి గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో మహిళలు, వృద్ధుల్లో భయాందోళనలు నెలకొన్నాయి.ఘటన విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్. బాబురావు, పార్టీ నాయకులు బి. రమణారావు, సీహెచ్. శ్రీనివాస్ తదితరులు బాధితురాలిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాబురావు, రమణ మాట్లాడుతూ వృద్ధురాలిపై జరిగిన దాడి అత్యంత అమానుషమని ఖండించారు. రాష్ట్రంలో మహిళలు, వృద్ధులు, చిన్నారులకు తగిన రక్షణ లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. గంజాయిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రకటిస్తున్న చర్యలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని విమర్శించారు. గంజాయి విక్రయాలు, వినియోగానికి మూలమైన నెట్వర్క్లను గుర్తించి నిర్మూలించడంలో ప్రభుత్వం, యంత్రాంగం విఫలమవుతోందని ఆరోపించారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పాలకులు ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతున్నారని, శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజాప్రతినిధులు పరామర్శలతో సరిపెట్టకుండా మహిళల భద్రత కోసం స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు.సుందరయ్య నగర్ కరకట్ట ప్రాంతంలో పేదలకు గృహ వసతి కల్పించడంతో పాటు వీధి దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరిన విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, గంజాయి నియంత్రణపై పోలీసులు ప్రచార కార్యక్రమాలతో పాటు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేలా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు.

# అమరనాథ్ గౌడ్ త్యాగం చిరస్మరణీయం



**విజయవాడ, తూర్పు జూన్ 16 ( మనం న్యూస్):** మూడేళ్ల క్రితం హత్యకు గురైన ఉప్పాల అమరనాథ్ గౌడ్కు కూటమి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన మూడో వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆంధ్ర కళ్యాణ మండపంలో నిర్వహించిన స్మారక కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చెరుకుపల్లి మండలం రాజోలు ప్రాంతంలోని ఉప్పాలవారిపాలెంకు చెందిన పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమరనాథ్ గౌడ్ మరణం అప్పట్లో తెలుగు రాష్ట్రాలను కలచివేసిందన్నారు. అన్యాయానికి ఎదురు నిలిచిన యువకుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. యువత సమాజంలో నైతిక విలువలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పడాల గంగాధర్, గొరిపర్తి నామేశ్వరరావు, పేరేపి ఈశ్వర్, ముమ్మనేని ప్రసాద్, కొక్కిరి తిరుపతయ్య, దాసరి గాబ్రియల్, కొర్ర అప్పన్న, సింగంశెట్టి రమేష్, గోగుల ఏసు, మొకర ఆదిబాబు, సొంగ సంజయ్ వర్మ, రేపాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహన



**63వ డివిజన్లో ఇంటింటా సర్ ప్రచారం**

**ఓటర్ వెరిఫికేషన్ నిర్వహణ**

**విజయవాడ, జూన్ 16 (మనం న్యూస్ ):** సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు సూచనల మేరకు 63వ డివిజన్ పరిధిలోని 88వ బూత్లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను పరిశీలించి ధృవీకరించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడు భాగస్వామి కావాలని, తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని నాయకులు ప్రజలకు సూచించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 62, 63 క్లస్టర్ ఇన్చార్జి బత్తుల కొండా, బీఎల్ఏ పద్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఓటర్లతో ప్రత్యక్షంగా మాట్లాడి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకోవడం, మార్పులు, చేర్పులు, తొలగింపుల అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు.

## ఓటరు సమగ్ర సర్వే వేగవంతం

**10 బూత్లలో క్షేత్రస్థాయి పరిశీలన**

**విజయవాడ సెంట్రల్ జూన్ 16 ( మనం న్యూస్ ):** ఓటరు జాబితాల ప్రక్షాళన, అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయడం లక్ష్యంగా చేపట్టిన ఓటరు సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సెంట్రల్ నియోజకవర్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం 26వ డివిజన్లో రెండో రోజు సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు.26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, డివిజన్ ఇన్చార్జి వల్లభనేని సతీష్ ఆధ్వర్యంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) కలిసి డివిజన్ పరిధిలోని 10 బూత్లలో ఇంటింటి పరిశీలన చేపట్టారు. ఓటర్ల వివరాలను ధృవీకరించడం, కొత్తగా ఓటు హక్కుకు అర్హులైన వారి వివరాలు నమోదు చేయడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను గుర్తించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గ సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్వో) దివ్య పాల్గొని సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసం ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను సేకరించాలని బీఎల్వోలు, బీఎల్ఏలకు సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో ముఖ్యమని, అందుకు ప్రజలు కూడా సర్వే సిబ్బందికి సహకరించాలని నాయకులు కోరారు. సర్వే ప్రక్రియ విజయవంతం అయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, బీఎల్వోలు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అమర్నాథ్ వ్యాఖ్యలపై మహిళల ఆగ్రహం..



**క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**విజయవాడ తూర్పు జూన్ 16 ( మనం న్యూస్):** రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కూటమి మహిళా నాయకులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అమర్నాథ్ చిత్రపటంపై కోడిగుడ్లు విసురుతూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ హోం మంత్రి అనితపై చేసిన వ్యాఖ్యలు మహిళా సమాజాన్ని అవమానించే విధంగా ఉన్నాయని విమర్శించారు. అమర్నాథ్ ఉపయోగించిన పదజాలాన్ని ఏ మహిళా సమర్థించదని పేర్కొన్నారు. మహిళలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్న సమయంలో వైసీపీ నాయకులు మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం బాధాకరమన్నారు.ఉపాధ్యాయ వృత్తి నుంచి ఎదిగి మంత్రి స్థాయికి చేరుకున్న అనిత పురోగతిని చూసి ఓర్వలేక ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా వైసీపీ నాయకుల తీరు మారలేదన్నారు. అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని హోం మంత్రి అనితకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కూటమి పార్టీలన్నీ ఏకగ్రీవంగా ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నాయని బీజేపీ నాయకుడు సాదినేని యామిని శర్మ పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని, రాజకీయ విమర్శలు వ్యక్తిగత దూషణల స్థాయికి దిగజారకూడదని అన్నారు. ప్రజలు తిరస్కరించినా వైసీపీ నాయకుల్లో మార్పు కనిపించడం లేదని విమర్శించారు .నిరసన కార్యక్రమంలో మూల్పూరి సాయి కల్యాణి, దయాల శిరీషా గాంధీ, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, సుగసాని రత్నశ్రీ, చిట్టా నిర్మల, రాయి రంగమ్మ, పి. లక్ష్మి, డాంగే కుమారి, శివలక్ష్మి, అమిర్నేని కరుణ, షకీలా, ఆర్. రమాదేవితో పాటు కూటమి మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాకింగ్ ట్రాక్, పార్క్ ఏర్పాటు చేయండి

**ఎం టి ఎం సి కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు**



**తాడేపల్లి, జూన్ 16, మనం న్యూస్:** సుమారు లక్ష జనాభా నివసిస్తున్న తాడేపల్లి పట్టణంలో వాకర్స్ కు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు సీనియర్ సిటిజన్స్ మరియు పట్టణ ప్రజలు సేద తీరడానికి వీలుగా పార్కు ఏర్పాటు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, అపార్ట్మెంట్ అసోసియేషన్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం గ్రీవెన్స్ లో ఎం టి ఎం సి కమిషనర్ షేక్ అలీమ్ భాష కు వినతి పత్రం అందజేశారు. అందుకు అనువైన స్థలాన్ని కూడా ప్రతినిధులు సూచించారు. తాడేపల్లి కొత్తూరు బ్రిడ్జి సమీపంలో ఉన్న భరతమాత విగ్రహం దగ్గర నుండి ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం వరకు గల బకింగ్ హామ్ కాలవ కట్ట ఇటు వాకింగ్ ట్రాక్ కు, అటు పార్కుకు చక్కగా వినియోగించుకోవచ్చని ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ స్థలాన్ని వినియోగించితే కార్పొరేషన్కు పెద్దగా ఖర్చు కూడా కాదని వివరించారు. ప్రస్తుతం వాకింగ్ ట్రాక్ లేకపోవటంతో నిత్యం 500 నుండి600 మంది వాకర్స్ వివిధ ప్రాంతాల్లో వాహనాలు తిరిగే రోడ్లమీద నడక సాగించాల్సి వస్తుందని చెప్పారు. దీనివలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని కూడా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు కూడా లేకపోవటంతో నడక మరి ఇబ్బందిగా మారిందని తెలిపారు.ముఖ్యంగా మహిళా వాకర్స్ నడకకు రావాలంటే భయపడుతున్న పరిస్థితి తాడేపల్లిలో నెలకొని ఉందని తెలిపారు. తాడేపల్లి పట్టణంలో నివాసాలు పెరుగుతున్నాయి. దానికి తగ్గట్టు జనాభా కూడా పెరుగుతుంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని తాము పైన సూచించిన స్థలంలో వాకింగ్ ట్రాక్ మరియు పార్క్ ఏర్పాటు చేయాలని వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు కమిషనర్ కు విన్నవించారు. కమిషనర్ను కలిసిన వారిలో పట్టణ సంక్షేమ సంఘం, అపార్ట్మెంట్ అసోసియేషన్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మయ్య, డివి భాస్కర్ రెడ్డి, వెంకటయ్య, పుండరీకార్జునరావు, శేషగిరిరావు, సాంబి రెడ్డి, కే శ్రీనివాసరావు, సిహెచ్ బిక్షాలు ఉన్నారు.

**క్రీడలు, యువత అభివృద్ధిపై కీలక చర్చ వరల్డ్ క్లాస్ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ లక్ష్యంగా నారా లోకేష్ చర్చలు జాంటీ రోడ్స్ స్ఫూర్తిదాయక క్రీడాకారుడు స్పోర్ట్స్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతాం మంత్రి నారా లోకేష్**

**( అమరావతి, జూన్ 16, మనం న్యూస్)**





# మంత్రి నారా లోకేష్ పర్యటనను జయప్రదం చేయండి



**వల్లభనేని, దానబోయిన**

**తాడేపల్లి, జూన్ 16, మనం న్యూస్:** రాష్ట్ర ఐటీ ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనను జయప్రదం చేయాలని టిడిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు,రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతి నిది దానబోయిన సుందరరావు యాదవ్ కోరారు.మంగళవారం సాయంత్రం తాడేపల్లి టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో పర్యటించనున్నారని అన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు మంత్రి నారా లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులకు కాజ గ్రామంలో కాజ లేక్ పార్క్ ప్రారంభోత్సవం నూతనంగా అభివృద్ధి చేసిన మహాప్రస్థానం సందర్శన. తాడేపల్లి పట్టణంలో ప్రాతూరు రోడ్డులో గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాడిబోయిన భాస్కర్,జి. నాగేశ్వరరావు,తోట సాంబశివరావు,మండవ గోపాలరావు,షేక్ నాగుల్ మీరావలి, కంభం సాయి చంద్, చింకా శ్రీను,బండి సాంబిరెడ్డి, సూర్య,తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు సహించం



**గుడివాడ అమర్నాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలుగు మహిళ డిమాండ్**

**విజయవాడ సెంట్రల్, జూన్ 16 (మనం న్యూస్):** మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలుగు మహిళ నాయకులు డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. సెంట్రల్ నియోజకవర్గ తెలుగు మహిళా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సింగ్నగర్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ అమర్నాథ్ చిత్రపటంపై కోడిగుడ్లు పగలకొట్టి మహిళా నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించి మహిళలను అవమానించే వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.మహిళా నాయకులు మాట్లాడుతూ రాజకీయ విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ మహిళల వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, రూపురేఖలను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు మహిళా సమాజాన్ని అవమానించే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దళిత మహిళ తన ప్రతిభతో రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తుంటే ఆమె పనితీరుపై విమర్శలు చేయకుండా వ్యక్తిగతంగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం మహిళా వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు. మహిళలను గౌరవించడం తెలియని నాయకులు ప్రజలకు నీతులు చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలు అనేక అవమానాలు, వేధింపులు ఎదుర్కొన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. మహిళలపై దాడులు, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, రాజకీయ వేధింపుల విషయంలో వైసీపీ నాయకత్వం మౌనంగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలపై వేధింపులు, అనుచిత ప్రవర్తన, అసభ్యకర వ్యాఖ్యల విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మహిళల రక్షణ కోసం శక్తి యాప్, ప్రత్యేక సైబర్ భద్రతా వ్యవస్థలు, వన్స్టాప్ సెంటర్లు వంటి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మహిళల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని రాష్ట్ర మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పైడి తులసి, ఎస్కే గౌసియా, పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# నారాయణ, శ్రీ చైతన్య స్కూల్స్, మరియు రేసోనెన్స్ కాలేజ్ లలో జోరుగా పుస్తకాల వ్యాపారం

**యూనిఫాముల వ్యాపారం అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ స్థానిక మండల ఎన్టీఆర్ జిల్లా నాయకులు**

**మైలవరం జూన్ 16 మనం న్యూస్:** స్థానిక శ్రీ చైతన్య , నారాయణ స్కూల్స్, మరియు రిసోనేన్స్ లలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లు, చిన్నపిల్లల యాక్టివిటీ వస్తువులు అడ్డగోలుగా వ్యాపారం చేస్తుంటే, ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగి అన్ని స్కూల్స్లో బుక్స్ ను సీజ్ చేసే వరకు ఉద్యమం కొనసాగించారు, ఈ సందర్భంగా స్థానిక ఎంఈఓ బాలు నారాయణ, శ్రీ చైతన్య, వివేకానంద స్కూల్స్కు తాళాలు వేసి బుక్స్, ఇతర సామాగ్రిని ను సీజ్ చేశారు, ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒకపక్క కార్పొరేటు కాలేజీలు రాగా మధ్యతరగతి కుటుంబాలను చదివును అడ్డంపెట్టి వ్యాపార కేంద్రాలుగా మలుచుకుని తల్లులు జేబులు కొల్లగొడు తున్నాయని, అదే తరహాలో కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కూడా దిగజారటం దురదృష్టకరమని అన్నారు. ఎంఈఓ సీజ్ చేసిన అన్ని పాఠ్యపుస్తకాలకు ఇతర వస్తువులకు పూర్తిగా స్వాధీనం పరుచుకొని తగిని రీతిలో స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఎంఈఓ కార్యాలయాన్ని కూడా ముట్టడిస్తుందని హెచ్చరించారు. రిసోనేన్స్ ప్రైవేట్ కాలేజీ పేరుతో గత రెండు సంవత్సరాల నుంచి



అడ్డగోలుగా పుస్తకాలను అమ్ముతూ సరైన రీతిలో క్లాసులు కూడా జరగకుండా విద్యార్థుల దగ్గర్నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసులు చేస్తూ దోపిడీకి గురి చేస్తున్నారని, ఈ కాలేజీకి ఎటువంటి గుర్తింపు కానీ, విద్యా శాఖ నుంచి ఎటువంటి ఆర్డర్స్ కానీ లేకుండానే, తప్పు పద్ధతులు పుస్తకాలు ముద్రించి, టీ షర్టు ముద్రించి, పాంప్లెట్లు వేసి అడ్డగోలుగా అడ్మిషన్లు చేసి 40,000 నుండి 50 వేల వరకు ఫీజులు వసులు చేస్తున్నారని, ఐఐటి , జేఈఈ మెయిన్స్ పేరుతో పేద కుటుంబాలను చిదిమేస్తున్నారని, గత ఏడది జేఈఈ మెయిన్స్ ఒక్క విద్యార్థి కూడా క్వాలిఫై కాకపోవడం గమనహర్షం అన్నారు. ఇటువంటి కాలేజీలు స్కూల్స్ ను విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వల్లే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తు న్నాయని పేదవర్గాల ను దోపిడీకి గురి చేస్తున్నారని మంచి విద్య కావాలని కోరుకుంటున్న పేదల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఫీజులు వస్తువులకు పాల్పడుతు న్నారని అన్నారు. తక్షణమే ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ జోక్యం చేసుకొని రెసోనేన్స్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని, అలాగే చైతన్య, నారాయణ ఇతర విద్యా సంస్థల్లో పుస్తకాల వ్యాపారం జరుగుతున్న సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ శివకృష్ణ, కే సురేష్, ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు, మొక్కలు కత్తి చరణ్ తేజ్, పచ్చళ్ళ మధు, కాప దేవేంద్రనాథ్, సందీపాము ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

# అమర్నాథ్ గౌడ్ త్యాగాన్ని మరువలేం



**గుంటూరు జూన్ 16 (మనం న్యూస్ ప్రతినిధి):** అమర్నాథ్ గౌడ్ త్యాగాన్ని మరువలేమని, బీసీలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ బీసీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి కార్యాలయంలో అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.రేపల్లెలో తన అక్కను వేధిస్తున్న వారిని ప్రశ్నించినందుకు 15 ఏళ్ల విద్యార్థి అమర్నాథ్ గౌడ్ను 2023 జూన్ 15న దారుణంగా హత్య చేసి సజీవ దహనం చేసిన ఘటన రాష్ట్ర ప్రజలను కలచివేసిందన్నారు.తప్పును ప్రశ్నించిన ఓ బీసీ బాలుడిని అత్యంత కిరాతకంగా హత్య చేయడం వైసీపీ హింసాత్మక రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.అమర్నాథ్ గౌడ్ హత్య ఘటనలో నిందితులను కాపాడేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. బీసీలపై వైసీపీ ప్రభుత్వానికి ఉన్న వివక్ష, కక్ష సాధింపు ధోరణికి ఈ ఘటన నిదర్శనమని పేర్కొన్నారు.బీసీల సంక్షేమం కోసం అమలవుతున్న 30కు పైగా పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి, వెనుకబడిన వర్గాలను అన్ని విధాలుగా అణగదొక్కిందని విమర్శించారు. ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ,కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్, నిమ్మల శేషయ్య, ఉప్పుతల సాంబ,గర్నెపూడి శివ, చాపల నాగరాజు,కలిచేటి హనుమంతరావు,ద్రోణాదుల శ్రీనివాస్, యారకుల శ్రీనివాస్, మల్లె అయ్యప్ప,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక నివాసితులందరికీ ఓటు హక్కు కల్పిస్తాం



**విజయవాడ, సెంట్రల్ జూన్ 16 ( మనం న్యూస్):** సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇందిరానాయక్నగర్, నందమూరినగర్, తోటవారి వీధి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి రామారావు, యూనిట్ ఇన్చార్జి ఎరుబోతు రామారావు బీఎల్వోలు, బీఎల్ఏలతో కలిసి ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఢ 5 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును ఈ ప్రాంతానికి బదిలీ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమస్యను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లామని, స్థానికంగా నివసిస్తున్న ప్రతి అర్హుడికి ఈ డివిజన్లోనే ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-క్లస్టర్ ఇన్చార్జి సర్వేపల్లి అమర్నాథ్ గౌడ్, బీఎల్వోలు స్వాతి, గీతశ్రీ, గ్లోరీ, శామ్యూల్, మోజెస్, రాజీవ్, బూత్ ఇన్చార్జులు దొండపాటి ఈశ్వర్, తోట నాగసాయి, గుత్తా వరప్రసాద్, చిట్టితల్లి, మర్రి పుల్లారావు, పాణిగ్రాహి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# వెస్ట్ బైపాస్‌ను పరిశీలించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



▶▶ ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మారిన ప్రాజెక్టు

**విజయవాడ పశ్చిమ, జూన్ 16 ( మనం న్యూస్)**ః విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన వెస్ట్ బైపాస్ను కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మంగళవారం పరిశీలించారు. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి పాల్గొన్నారు. సుమారు రూ.2,700 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ బైపాస్ ద్వారా గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలు కృష్ణానదిపై ఉన్న వంతెనను దాటి సీడ్ యాక్సెస్ రోడ్డు ద్వారా నేరుగా అమరావతి ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని జాతీయ రహదారుల శాఖ అధికారులు కేంద్రమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ, వెస్ట్ బైపాస్ అందుబాటులోకి రావడంతో విజయవాడ నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. వెస్ట్ బైపాస్ ద్వారా భారీ వాహనాల రాకపోకలు నగరంలోకి ప్రవేశించకుండా మళ్లించడం వల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల శాఖ అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# కానూరులో విద్యా మిత్ర కిట్ల పంపిణీ

**మచిలీపట్నం, జూన్ 16 మనం న్యూస్ః** మచిలీపట్నం మండలం కానూరు గ్రామంలోని వన్నూరు కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్ద కానూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తదితర పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థులకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 185 మంది విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటే, వారి చదువు కొనసాగించేందుకు తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, గోపు వెంకటరమణ, పీత రాము, మోపిదేవి కృష్ణమూర్తి, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, బొమ్మిడి ఏడుకొండలు, గోకపై విజయ్, స్వర్ణ గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వ్యాధుల నివారణకు యోగా ఉత్తమ ఔషధం



▶▶ జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

▶▶ కూచిపూడి గ్రామంలో యోగా కార్యక్రమం నిర్వహించిన జిల్లా యంత్రాంగం

▶▶ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు పాల్గొన్న పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్

**పామర్రు : జూన్ 16,( మనం న్యూస్ ):** యోగా ద్వారా డయాబెటిస్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులను నియంత్రించుకోవచ్చని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు, సమాజం, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతాయని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పేర్కొన్నారు. అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవం-2026 వేడుకల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మొవ్వ మండలం, కూచిపూడి గ్రామంలోని జిమ్ ప్రాంగణంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తదితరులు ఉత్సాహంగా పాల్గొని ప్రజలతో పాటు సామూహిక యోగాసనాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక నుండి యోగా శిక్షకులు రెబ్బా పోతన శాస్త్రి ఆసనాలు వేసే విధానాన్ని ప్రదర్శిస్తూ వారిచేత చేయించారు. అనంతరం యోగ ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలు మైదానంలో ఆసనాలు వేసేందుకు వీలుగా పచ్చని తివాచీలను ఏర్పాటు చేశారు. పెద్ద బ్యానర్ పై కూచిపూడి నృత్య భంగిమ ఆకృతిని ముద్రించి, వచ్చిన ప్రజలను ఆ ఆకృతిలో కూర్చోబెట్టి ఆసనాలు నిర్వహించిన దృశ్యం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేసి వారికి అల్పాహారం, తాగునీరు అందించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు జబ్బుల బారిన పడకముందే వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడం, వ్యాధులను నివారించడం యోగాంధ్ర కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. నిత్య యోగాభ్యాసం ద్వారా డయాబెటిస్, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు వంటి నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్సీడీలు) ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే వైద్య చికిత్సల కోసం అయ్యే ఖర్చులు తగ్గడంతో పాటు ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కూడా తగ్గుతుందన్నారు. యోగా శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుందని ఆయన తెలిపారు. యోగాభ్యాసం వల్ల మానసిక చురుకుదనం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, తద్వారా తక్కువ సమయంలో ఎక్కువ పనిని సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం పెరిగి ఉత్పాదకత మెరుగుపడుతుందని చెప్పారు. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందన్నారు. చిన్నారులు చిన్న వయస్సు నుంచే యోగాను అలవాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. యోగా వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరిగి విద్యాభ్యాసంలో మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన, చురుకైన జీవితాన్ని గడపగలరని తెలిపారు. యోగాను కనీసం ఒక నెల రోజుల పాటు క్రమం తప్పకుండా అభ్యసిస్తే దాని సానుకూల ఫలితాలను ప్రతి ఒక్కరూ స్పష్టంగా గమనించగలరని అన్నారు. ప్రజలందరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## యోగ భారతీయ సంస్కృతికి ప్రతీక.. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలి : ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ యోగ కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మనస్సు, శరీరం, ఆత్మలను సమన్వయం చేసే గొప్ప జీవన విధానమని అన్నారు. ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన కానుక యోగ అని, ప్రతి భారతీయుడు దానిని ఆచరించాల్సిన బాధ్యత ఉందన్నారు. రోజుకు అరగంట లేదా గంట సమయం యోగా కోసం కేటాయిస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి, ఆందోళనలను అధిగమించవచ్చన్నారు. ముఖ్యంగా నేటి యువత తరంలో పెరుగుతున్న ఒత్తిడిని ఎదుర్కోవడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. యోగాను ప్రతి కుటుంబంలో ఒక దినచర్యగా మార్చుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కూచిపూడి గ్రామం చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రపంచ ప్రఖ్యాత కూచిపూడి నృత్య కళకు పుట్టినిల్లు అయిన ఈ ప్రాంతం నాలుగు వందల ఏళ్లకు పైగా గొప్ప వారసత్వాన్ని కలిగి ఉందన్నారు. గతంలో వేలాది మంది కళాకారులు ఒకే వేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రపంచ దృష్టిని ఆకర్షించిన విషయాన్ని ప్రస్తావించారు. దేశ విదేశాల నుంచి కళాకారులు, కళాభిమానులు కూచిపూడికి రావడం ఈ ప్రాంత ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. ఈ చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కూచిపూడి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గ్రామంలోని కోనేరును అభివృద్ధి చేసేందుకు కోట్ల రూపాయల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కూచిపూడి పరిసర ప్రాంతాల్లో రహదారి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, సాంకేతిక కారణాల వల్ల నిలిచిన కొన్ని పనులు కూడా త్వరలో పూర్తి చేసి వచ్చే ఆరు నెలల్లో అన్ని ప్రధాన రహదారులను మెరుగుపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు నాగరాజు, శేష ప్రసన్న ఆధ్వర్యంలో యార్లగడ్డ ఫౌండేషన్ విద్యార్థులు చేసిన యోగా నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. నాట్య గురువు డాక్టర్ వేదాంత రాదే శ్యామ్ తన నృత్య ప్రదర్శనతో యోగా ప్రియులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీవో ఎస్ కరుణ కుమారి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ దోనెపూడి శివరామయ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి రామలక్ష్మణరావు, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీ లక్ష్మి, జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, ఎస్జిఎస్డబ్ల్యూ డిసిఓ రవికాంత్, తహసిల్దార్ మస్తాన్, ఎంపీడీవో సుహాసిని, ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ వాహిని, యోగ గురువు మద్దాల చింతయ్య, విద్యార్థులు, ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రశ్నిస్తే దాడులు.. ఉప్పల అమర్నాథ్ హత్య అందుకు నిదర్శనం




● మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం జూన్ 16 మనం న్యూస్: గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రశ్నించిన వారిపై దాడులు జరిగిన ఘటనలకు ఉప్పల అమర్నాథ్ హత్య ఒక ఉదాహరణ అని రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం మచిలీపట్నం బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన ఉప్పల అమర్నాథ్ మృతి చెంది మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలో శాంతియాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ అమర్నాథ్ తన అక్కను వేధించవద్దని వెంకటేశ్వర రెడ్డిని ప్రశ్నించినందుకే కక్ష పెంచుకుని హత్య చేశారని ఆరోపించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రజలపై అనేక హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని, ప్రశ్నించే గొంతుకలను అణిచివేసే ప్రయత్నాలు జరిగాయని విమర్శించారు.ఒకటి కాదు వందలాది మంది మృతికి గత ప్రభుత్వ విధానాలే కారణమయ్యాయని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాసే విధంగా అప్పటి పాలన సాగిందని మంత్రి అన్నారు. ఉప్పల అమర్నాథ్ వంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా సమాజం అప్రమత్తంగా ఉండాలని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉప్పల అమర్నాథ్కు ఘన నివాళులర్పించారు.

## జిల్లాలో నేటి నుంచి కేంద్ర ప్రభారీ అధికారి పర్యటన

● తొలిరోజు

పెనుగంచిప్రోలులో ఎన్డబ్ల్యూఎం డైరెక్టర్ ఎన్.అశోక్బాబు పర్యటన

● ఈ నెల 18న

ఇబ్రహీంపట్నం మండలంలో క్షేత్రస్థాయి సందర్శనలు



విజయవాడ,జూన్,16,(మనం న్యూస్): జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఎబిపి) కింద ఉన్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో పర్యటించి.. లక్ష్యాల సాధనలో పురోగతిని స్వయంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభారీ అధికారి, జాతీయ జల మిషన్ (ఎన్డబ్ల్యూఎం) డైరెక్టర్ నేలపట్ల అశోక్బాబు ఈ నెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 17వ తేదీన పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలుతో పాటు గుమ్మడిదుర్రు, లింగగూడెం, తోటచెర్ల, శనగపాడు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యటించనుండగా.. 18వ తేదీన ఇబ్రహీంపట్నం మండలంలో ఇబ్రహీంపట్నంతో పాటు కొటికలపూడి, మూలపాడు, జూపూడి, కొండపల్లి, గుంటుపల్లి గ్రామాల్లో రోజంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. ఈ నెల 19న జిల్లా కలెక్టరేట్లో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్లు, అంగన్వాడీ కేంద్రాలు, శనగపాడు గ్రామంలోని గ్రామీణ కృషి పరిజ్ఞాన్ కేంద్రం (జీకేపీకే), గుంటుపల్లి లోని రైజ్ కేంద్రం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్డబ్ల్యూపీసీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్కే), ఉన్నత పాఠశాలలు, పంట పొలాలు, ఉద్యాన పంటలు, జల జీవన్ మిషన్ పనులు తదితరాలను సందర్శిస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులతో మాట్లాడుతారు. అదేవిధంగా మండలస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కీలక సామాజిక, ఆర్థిక సూచికల్లో పురోగతిపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేస్తారు. పర్యటనలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలతోనూ ప్రభారీ అధికారి అశోక్బాబు మమేకమవుతారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి

మచిలీపట్నం: జూన్ 16 మనం న్యూస్: రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు కృష్ణా జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బందరు సబ్ డివిజన్ ఇన్చార్జి డీఎస్పీ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందరు ట్రాఫిక్ సీఐ సున్నా రాజు నేతృత్వంలో మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద హెల్మెట్ వినియోగం, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ ప్రమాద సమయంలో ప్రాణ రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. వాహనం నడుపుతూ సెల్ఫోన్ వినియోగించడం, అతివేగంగా ప్రయాణించడం, మద్యం సేవించి




వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరి భద్రత కోసం రూపొందించబడ్డాయని, రహదారిపై ప్రయాణించే సమయంలో ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని పోలీసులు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా సిగ్నల్స్ పాటించడం, వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవడం, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రహదారులపై పశువులను వదిలివేయడం వల్ల వాహనదారులకు ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. పశువుల యజమానులు తమ పశువులను నియంత్రణలో ఉంచి రోడ్లపైకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బందరు ట్రాఫిక్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొని వాహనదారులకు రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు సహకరించాలని పోలీసులు కోరారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## రెండేళ్లలో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన కూటమి ప్రభుత్వం

● ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ తూర్పు జూన్ 16 (మనం న్యూస్): అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం 13వ డివిజన్ డొంకరోడ్డు చివర నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు.ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల హామీల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయడంలో ప్రభుత్వం విజయవంతమైందన్నారు. సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాల సృష్టి వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి సాధించామని వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతోందని చెప్పారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోనూ పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రజల ఆశీర్వాదాలు, కార్యకర్తల అంకితభావమే కూటమి ప్రభుత్వ విజయానికి కారణమని చిన్ని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని, రాబోయే రోజుల్లో మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి ఆంధ్రప్రదేశ్ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, జనసేన, బీజేపీ నాయకులు, కూటమి పార్టీల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట నియోజకవర్గంలో కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు



జగ్గయ్యపేట జూన్ 16 మనం న్యూస్: జనసేన పార్టీ చేరికల సమన్వయానికి ఏర్పాటుచేసిన జాయినింగ్స్ కమిటీ లో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ను సభ్యులుగా ఎంపిక చేయటం పట్ల జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జనసేన పార్టీ నేతలు కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు వ్యక్తం అవుతున్నాయి.జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా జాయినింగ్స్ కమిటీని నియమిం చారు. 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారి చేరికలను సమన్వయం చేస్తుంది. కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా.హరిప్రసాద్, డా.పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, టి సి వరుణ్, ఆరణి మదన్ లను సభ్యులుగా ఎంపిక చేశారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను. ను సభ్యులుగా ఎంపిక చేయటం పట్ల జగ్గయ్యపేట నియోజకవర్గం లోని జనసేన పార్టీ నేతలు కార్యకర్తలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తూ న్నా రు.జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ నుంచి సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో వేలాదిగా జనసేన పార్టీలో చేరికలు ఉంటాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# యోగాంధ్రలో ఏపీయూడబ్ల్యూజే




**విజయవాడ,జూన్ 16,(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) భాగస్వామ్యం అయింది. మంగళవారం నాడు భవానిపురంలోని బెరం పార్క్ లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యూజే నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మి షా పిలుపుమేరకు ఏపీయూడబ్ల్యూజే, అనుబంధ సంఘాలైన విజయవాడ ప్రెస్ క్లబ్, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న పత్రికల సంఘం, ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ నాయకులు పెద్ద ఎత్తున యోగేంద్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు .ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే, దాని అనుబంధ సంఘాలు భాగస్వాములు అవుతున్నాయని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని చేపట్టే కార్యక్రమాలకు ఏపీయూడబ్ల్యూజే, అనుబంధ సంఘాలు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటిస్తూ భాగస్వాములు అవుతున్న విషయాన్ని గుర్తు చేశారు. మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి యోగ సాధన ఎంతో ఉపకరిస్తుందని అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు .నిత్యం పని ఒత్తిడిలో ఉంటూ రకరకాల ఆందోళనలతో వృత్తి జీవితాన్ని గడుపుతున్న జర్నలిస్టులకు యోగ సాధన అత్యుత్తమమైన రిలీఫ్ గా పని చేస్తుందని సూచించారు .ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే, అనుబంధ సంఘాలను కూడా భాగస్వామ్యం చేయటం పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీ షా కు కృతజ్ఞతలు తెలిపారు .యోగాంధ్ర కార్యక్రమాలే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అనేక ప్రజాహిత ,సంక్షేమ కార్యక్రమాలను ఏపీడబ్ల్యూజే అనుబంధ సంఘాలు ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో ముందు వరుసలో ఉంటున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా రవి, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి, కార్యవర్గ సభ్యులు సురేష్, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనాథ్ పాల్గొన్నారు

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కల్పిస్తాం

- **తగిన మార్గదర్శకాలు తయారు చేస్తున్నాం**
- **విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం**
- **ఏపీయూడబ్ల్యూజే నేతలకు కలెక్టర్ లక్ష్మీశా హామీ**



విజయవాడ, జూన్ 16,మనం న్యూస్‌: వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కల్పిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా హామీ ఇచ్చారు. ఈ మేరకు తగిన మార్గదర్శకాలు రూపొందించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏపీయూడబ్ల్యూజే , విజయవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మిశ ను కలెక్టరేట్ లో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. గతంలో కూడా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ కల్పించిన విషయాన్ని కలెక్టర్ కు గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు ఎక్కువగా ఉన్నాయని, అంత మేర జర్నలిస్టులు చెల్లించుకునే పరిస్థితుల్లో లేరని కలెక్టర్ వివరించారు. గతంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ పరిధిలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఫీజు రాయితీని అమలు చేయలేదని, ఈసారి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీని అమలు చేసే విధంగా ఆదేశాల్లు జారీ చేయాలని కలెక్టర్ కు యూనియన్ నాయకులు విన్నవించారు. దీనిపైన స్పందించిన కలెక్టర్ ఈ సారి తప్పకుండా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు రాయితీకి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, ఉపాధ్యక్షులు చావా రవి, విజయవాడ ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.రమణారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.రఘురామ్ తదితరులు కలెక్టర్ ను కలిసిన వారిలో ఉన్నారు.



# వెలిగొండ పూర్తి దిశగా వేగంగా అడుగులు

## కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

## బిజెపి నేత డా. ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం.జూన్,16,(మనం న్యూస్)**ః పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రతి నెలా వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తూ పనుల్లో వేగం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. తాజాగా మంత్రి నిమ్మల రామానాయుడు, మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు కలిసి వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్లు, ఫీడర్ కాలువలను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ఈ సందర్శనే ప్రాజెక్టు పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన అన్నారు.ప్రాజెక్టు పనుల పురోగతిని వివరిస్తూ, టన్నెల్-1లో అడ్డంకిగా ఉన్న 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ (వ్యర్థ రాయి, మట్టి) తొలగింపు పనుల్లో ఇప్పటికే 40 వేల క్యూబిక్ మీటర్ల మక్కు తొలగించారని తెలిపారు. అలాగే టన్నెల్-2లో మొత్తం 7 కిలోమీటర్ల లైనింగ్ పనులకు గాను గత 20 నెలల్లో 5.5 కిలోమీటర్ల లైనింగ్ పూర్తి చేయడం ద్వారా ప్రాజెక్టు పూర్తి దశకు చేరుకుందని వెల్లడించారు. నల్లమలసాగర్ రిజర్వాయర్లో నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్వాసితుల పునరావాస కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అదనపు బడ్జెట్లో రూ.905 కోట్లు కేటాయించడం కూడా ప్రాజెక్టు పూర్తి పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోందని ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. ప్రాజెక్టు పూర్తి కావడంతో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.